మార్నింగ్ కాఫీ విత్ హాట్ న్యూస్‌తో...! మీ

# డ్రీమ్ టైమ్స్

తెలుగు దిన పత్రిక

శుక్రవారం 9-10-2026
పేజీలు: 8 వెల: రూ.2/-

సంపుటి:5 సంచిక 308

Published from Kurnool circulated all over Andhra Pradesh and Telangana All District



## విలేకరులు కావలెను



తెలంగాణ ,ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా డ్రీమ్ టైమ్స్ దినపత్రికలో బ్యూరో, మండలాల రిపోర్టర్ గా పని చేయుటకు జిల్లాల, నియోజకవర్గ స్థాయిలో ఉత్సాహవంతులైన యువతి ,యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును

8500066609




# యూపీఐ ఛార్జీలకు బ్రేక్?

- రూ.2,000 దాటిన లావాదేవీలపై రుసుము వాయిదా?
- జనవరి వరకు పొడిగించే యోచనలో కేంద్రం
- పండగల వేళ వ్యాపారులపై భారం పడకుండా చర్యలు
- వినియోగదారులు నేరుగా రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు
- చెల్లింపుల సంస్థలకు సాంకేతిక మార్పులకు అదనపు సమయం
- ఆగస్టులో రూ.29.82 లక్షల కోట్ల లావాదేవీలు

03

పండగల వేళ డిజిటల్ చెల్లింపులపై అదనపు భారం పడకుండా కేంద్రం కీలక నిర్ణయం తీసుకునే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. రూ.2,000 దాటిన వ్యాపార సంబంధిత యూపీఐ లావాదేవీలపై ప్రతిపాదించిన 0.4 శాతం రుసుము అమలును జనవరి వరకు వాయిదా వేసే అవకాశముంది. అక్టోబర్ 15 నుంచి అమలు చేయాలని భావించిన ఈ విధానంపై త్వరలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అయితే, గడువు పొడిగింపుపై ఇంకా అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.



03

## నేడు వెస్టిండీస్‌తో రెండో టీ20

- తొలి మ్యాచ్‌లో 8 వికెట్లతో భారత్ ఘన విజయం
- శతకంతో చెలరేగిన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్
- జోరుమీదున్న టీమిండియా బ్యాటర్లు
- మరో గెలుపే లక్ష్యంగా బరిలోకి
- తొలి విజయం కోసం విండీస్ ఆరాటం
- రాత్రి 7గం. నుంచి స్టార్ స్పోర్ట్స్, జియోహాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

# గోదారి-కావేరిని కలపండి!

## ప్రధానికి చంద్రబాబు అభ్యర్థన

- పుష్కరాలకు ప్రత్యేక నిధులివ్వండి
- మౌలిక వసతుల ప్రాజెక్టులకు సహకరించండి
- విశాఖకు మెట్రో రైలు ఇవ్వండి
- పాతికేళ్ల పాలనా ప్రస్థానంపై శుభాకాంక్షలు
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, అభివృద్ధి కార్యక్రమాలపై వివరణ
- పలువురు కేంద్ర మంత్రులతో వరుస భేటీలు

**న్యూఢిల్లీ,**

గోదావరి-కావేరి నదుల అనుసంధానానికి కేంద్రం సహకరించాలని ప్రధాని మోదీకి ముఖ్యమంత్రి చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. కేంద్రం చొరవ, రాష్ట్రాల సమన్వయంతో ఈ నదుల అనుసంధానం జరిగితే దక్షిణాదిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు సమృద్ధిగా నీరు అందుతుందన్నారు. గురువారం సాయంత్రం ఢిల్లీలోని లోక్‌కల్యాణ్ మార్గ్‌లో ప్రధాని నివాసంలో ఆయనతో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రాభివృద్ధికి చెందిన వివిధ కీలక ప్రాజెక్టులు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, వ్యవసాయ, నీటిపారుదల వంటి అంశాలను ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. పోలవరం ప్రాజెక్టు తాజా నివేదికతో పాటు

-మిగతా 3 లో





## వైద్య పరీక్షల నిర్వహణ లోపాలపై ఆరోగ్య శాఖ మంత్రి ఫైర్!

### సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఆ శాఖ కార్యదర్శికి ఆదేశాలు

**నంద్యాల బ్యూరో, అక్టోబరు 08. (డ్రీమ్ టైమ్స్)**

నంద్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాలలో వైద్య విద్యార్థుల పరీక్షల నిర్వహణలో చోటుచేసుకున్న లోపాలు, కాపీయింగ్ వ్యవహారంపై రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఘటనపై వారం రోజుల్లోగా సమగ్ర విచారణ జరిపి నివేదిక అందజేయాలని వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శిని ఆదేశించినట్లు తెలిసింది. విషయానికి వస్తే.. 2023 బ్యాచ్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులు ఆగస్టులో బ్యాక్‌లాగ్ పరీక్షకు హాజరయ్యారు. వీరి పరీక్ష కోసం మొదట 2023 ప్రశ్నపత్రం, అనంతరం 2026 ప్రశ్నపత్రాన్ని యూనివర్సిటీ నుంచి పంపినట్లు సమాచారం. అయితే సిబ్బంది 2026 ప్రశ్నపత్రం స్థానంలో పొరపాటున 2023 ప్రశ్నపత్రాన్ని ప్రింట్ తీసి విద్యార్థులకు పంపిణీ చేశారు. మూడేళ్ల నాటి ప్రశ్నపత్రం ఇవ్వడంతో గుర్తించిన విద్యార్థులు ఆశ్చర్యానికి గురై విషయాన్ని ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో జరిగిన పొరపాటును గుర్తించిన సిబ్బంది 2026 ప్రశ్నపత్రాన్ని అందించి విద్యార్థులకు పరీక్ష నిర్వహించారు. ఈ ఘటనపై తీవ్రంగా స్పందించిన మంత్రి సత్యకుమార్ యాదవ్ పరీక్షల నిర్వహణలో జరిగిన లోపాలు, పరీక్షా కేంద్రంలో చోటుచేసుకున్న పరిణామాలు, కాపీయింగ్‌కు ఉపయోగించిన విధానం తదితర అంశాలను పూర్తిగా పరిశీలించాలని అధికారులను ఆదేశించినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. వారం రోజుల్లో సమగ్ర విచారణ పూర్తి చేసి నివేదిక సమర్పించాలంటూ సంబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలిసింది.



03

## సీఈసీ జ్ఞానేశ్‌కు అదనపు భద్రత

- ఇప్పటికే జెడ్ ప్లస్ భద్రతలో ఉన్న ప్రధాన ఎన్నికల కమిషనర్
- అదనపు రక్షణగా సీఐఎస్ఎఫ్ సిబ్బంది మోహరింపు
- 'సర్' ప్రక్రియపై ఆందోళనల నేపథ్యంలో నిర్ణయం
- ఎన్నికల సంఘం కార్యాలయం వద్ద భద్రత కట్టుదిట్టం
- సీఈసీ నివాసం వద్ద అదనపు భద్రతా ఏర్పాట్లు
- ఇంటి వద్ద 24 గంటల పాటు పోలీసుల కాపలా
- ప్రస్తుత ముప్పు అంచనా ఆధారంగా నిర్ణయం

## సూపర్ ఎల్‌నినోతో భూగోళం భగభగలు!

- ప్రపంచవ్యాప్తంగా పెరగనున్న ఎండల తీవ్రత
- వాతావరణ మార్పులపై ఐక్యరాజ్యసమితి హెచ్చరిక
- 1950 తర్వాత అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే ప్రమాదం
- పసిఫిక్ సముద్రంలో పెరుగుతున్న వేడి ప్రభావం
- 2027 ఫిబ్రవరి వరకు ఎల్‌నినో ప్రభావం ఉండే అవకాశం
- మధ్య, తూర్పు పసిఫిక్‌లో సముద్ర వేడి పెరుగుదల
- ప్రపంచవ్యాప్తంగా వాతావరణంలో తీవ్ర మార్పులు
- అదనపు మరణాలు సంభవించే ప్రమాదమని పరిశోధకుల అంచనా



03

## బెంగళూరులో సీజేపీ భారీ నిరసన

- ఓటర్ల జాబితా, ఎన్నికల ప్రక్రియపై ఆందోళన
- నిరసనలో పాల్గొన్న అభిజిత్ దీప్కే, ప్రకాశ్ రాజ్
- సామాజిక మాధ్యమాల ప్రముఖుడు ధ్రువ్ రాఠీ మద్దతు
- ఓట్ల చోరీతోనే మోదీ గెలిచారని దీప్కే ఆరోపణ
- 'ఒక దేశం.. ఒక పార్టీ' లక్ష్యంగా బీజేపీ పనిచేస్తోందని విమర్శ
- ఓటర్ల పేర్ల తొలగింపుపై ప్రకాశ్ రాజ్ ఆందోళన
- ఎస్ఐఆర్ రద్దు, జ్ఞానేశ్ కుమార్‌పై కేసు నమోదు చేయాలని డిమాండ్
- నిరసన నేపథ్యంలో భారీగా పోలీసు బందోబస్తు



03



## సుప్రీంకోర్టు తీర్పు రాగానే స్థానిక ఎన్నికలు!

- ఏపీ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా వెల్లడి
- ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం సిద్ధం
- కలెక్టర్లు, ఎస్పీలతో ఎస్ఈసీ సమీక్ష
- రెండు నెలలుగా ఎన్నికల ఏర్పాట్లపై కసరత్తు
- బ్యాలెట్ పేపర్ల విధానంలోనే పోలింగ్
- ఫిబ్రవరి 5, 2026 నాటి ఓటర్ల జాబితా ప్రామాణికం
- బ్యాలెట్ పేపర్ల ముద్రణకు త్వరలో ప్రింటింగ్ ప్రెస్ ఖరారు

**అమరావతి, ఏపీ బ్యూరో,**

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్ చంద్ర పునేఠా స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన వెంటనే ఎన్నికల ప్రక్రియను ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు.జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు, ఇతర ఉన్నతాధికారులతో గురువారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

-మిగతా 3 లో



03

## నోబెల్ శాంతి బహుమతికి నేను అర్హుడిని!

- ఎనిమిది యుద్ధాలను ఆపా.. ట్రంప్ ప్రకటన
- గత అధ్యక్షులెవరూ చేయని పనులు చేశానని వ్యాఖ్య
- శాంతి పురస్కారం పొందేందుకు అన్ని అర్హతలున్నాయన్న అమెరికా అధ్యక్షుడు
- బహుమతి వస్తుందన్న నమ్మకం మాత్రం తక్కువేనని వెల్లడి
- నోబెల్ కమిటీ నిర్ణయంపై ట్రంప్ వ్యాఖ్యలు
- గత ఏడాది పురస్కారం దక్కకపోవడంతో నిరాశ
- వెనెజువెలా ప్రతిపక్ష నేత మరియా కొరీనా మచాడోకు గత ఏడాది పురస్కారం
- 2026 నోబెల్ శాంతి బహుమతిపై సర్వత్రా ఆసక్తి

# వ్యక్తులు కాదు.. వ్యవస్థే ముఖ్యం!

## ఐటీడీపీకి నారా లోకేశ్ దిశానిర్దేశం

- ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- వైసీపీ దుష్ప్రచారాన్ని ఆధారాలతో తిప్పికొట్టాలి
- ఐటీడీపీ కమిటీల నియామకాలు త్వరగా పూర్తి చేయాలి
- ప్రతి సభ్యుడినీ 'మై టీడీపీ యాప్'తో అనుసంధానించాలి
- పార్టీ, ప్రభుత్వానికి వారధిగా ఐటీడీపీ పనిచేయాలి
- ఇతర విభాగాలతో సమన్వయంతో ముందుకు సాగాలి



**అమరావతి**

వ్యక్తుల కంటే వ్యవస్థకే ప్రాధాన్యమిస్తూ తెలుగుదేశం పార్టీ ఐటీ విభాగం (ఐటీడీపీ) పనిచేయాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేశ్ దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు, ప్రతిపక్ష వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని ఆధారాలతో సమర్థవంతంగా తిప్పికొట్టాలని సూచించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

-మిగతా 3 లో

# కోల్‌కతా ఎయిర్‌పోర్టుకు బాంబు బెదిరింపు..

**-కొనసాగుతున్న తనిఖీలు**




**న్యూఢిల్లీ: (డ్రీమ్ టైమ్స్)**
పశ్చిమ బెంగాల్, కోల్‌కతాలోని ఎయిర్‌పోర్టుకు గురువారం బాంబు బెదిరింపు వచ్చింది. దీంతో భద్రతా విభాగానికి చెందిన అధికారులు తనిఖీలు చేపట్టారు. అధికారులు అందించిన సమాచారం ప్రకారం.. కోల్‌కతాలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు గురువారం మెయిల్ ద్వారా బాంబు బెదిరింపు వచ్చింది. ఎయిర్‌పోర్టులో ఒక బాంబు పెట్టినట్లు ఆ మెయిల్ సారాంశం.దీనిపై ఎయిర్‌పోర్టు అధికారుల నుంచి సమాచారం అందుకున్న భద్రతా దళాలు ఎయిర్‌పోర్టు పరిసరాల్లో తనిఖీలు చేపట్టారు. ఎయిర్‌పోర్టు లోపల, బయట తనిఖీలు చేపట్టారు. గతంలో కూడా ఈ ఎయిర్‌పోర్టుకు బాంబు బెదిరింపులు వచ్చాయి. తనిఖీల తర్వాత ఆ బెదిరింపులు ఉత్తుత్తివే అని తేలింది. గతంలో ఇలాంటి బెదిరింపులు ఉత్తుత్తివే అని తేలినప్పటికీ, ఇప్పుడు నిర్లక్ష్యం వహించకుండా అన్ని రకాలుగా తనిఖీ చేస్తున్నారు. నిర్దిష్ట ప్రమాణాలకు అనుగుణంగా తనిఖీలు చేపట్టారు. ప్రయాణికులు, లగేజ్‌ను కూడా తనిఖీ చేస్తున్నారు. మరోవైపు ఈ మెయిల్ ఎవరు పంపారు.. ఎక్కడి నుంచి వచ్చింది వంటి వివరాలపై కూడా పోలీసులు ఆరా తీస్తున్నారు. అయితే, ఈ అంశానికి సంబంధించిన పూర్తి వివరాల్ని అధికారులు ఇంకా వెల్లడించలేదు. గత ఫిబ్రవరి నుంచి కోల్‌కతా ఎయిర్‌పోర్టుకు పలు బెదిరింపులు వచ్చాయి. ఇంకోవైపు గుజరాత్, అహ్మదాబాద్‌లోని 10 ప్రైవేటు స్కూళ్లకు కూడా బుధవారం బాంబు బెదిరింపులు వచ్చాయి. దీంతో సమాచారం అందుకున్న పోలీసులు ఆయా స్కూళ్లకు చేరుకుని తనిఖీలు నిర్వహించారు. అయితే, ఎక్కడా బాంబులు లేవని తేల్చారు.

# రోగులను ఆకట్టుకునే ప్రకటనలపై నిషేధం..

**-సోషల్ మీడియాలో డాక్టర్లు, దవాఖానల ప్రచారంపై నియంత్రణ**

**-నేషనల్ మెడికల్ కమిషన్ కొత్త మార్గదర్శకాలు అమల్లోకి**

**న్యూఢిల్లీ: (డ్రీమ్ టైమ్స్)**



వైద్యులు, దవాఖానలు ఇకపై రోగులను ఆకట్టుకోవడానికి సోషల్ మీడియాను ఇష్టానుసారంగా వాడుకోలేరు. నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ) జారీచేసిన కొత్త నిబంధనల ప్రకారం ఇన్‌స్టాగ్రామ్, ఇన్‌ఫ్లూయెన్సర్ మార్కెటింగ్, స్పాన్సర్డ్ పోస్టులు, ఏఐ సృష్టించిన ప్రచారాలను కూడా వైద్య ప్రకటనల పరిధిలోకి తీసుకువచ్చాయి. దవాఖానలు/వైద్య సంస్థలు, రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టిషనర్లు పాటించవలసిన నైతిక ప్రకటనలు, ప్రజా సమాచార ప్రసారంపై ఎన్ఎంసీ ఈనెల 6న జారీ చేసిన కొత్త మార్గదర్శకాలు తక్షణమే అమల్లోకి వచ్చాయి.వైద్య సేవలను మార్కెట్ చేయడానికి, రోగుల అభిప్రాయాలు, డబ్బు చెల్లించి రాయించిన లేదా నకిలీ సమీక్షలు, తప్పుదోవ పట్టించే వాదనలు, హామీతో కూడిన చికిత్స ఫలితాలు, రోగుల కథనాలను ఉపయోగించకుండా ఈ నిబంధనలు వైద్యులను నిషేధిస్తున్నాయి. వైద్యులు కేవలం ఆరోగ్య అవగాహన కోసమే కాకుండా, తమ వ్యక్తిగత బ్రాండ్‌లను నిర్మించుకోవడానికి, రోగులను ఆకర్షించడానికి కూడా ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, ఇతర వేదికలను ఎక్కువగా ఉపయోగిస్తున్న తరుణంలో ఎన్ఎంసీ ఈ చర్య తీసుకుంది. ప్రజారోగ్య సమాచారానికి, వాణిజ్య ప్రచారానికి మధ్య ఎన్ఎంసీ ఇప్పుడు మరింత స్పష్టమైన గీతను గీసింది. తమ వాదనలకు రుజువులు చూపగలిగితే తప్ప తమ చికిత్స, సౌకర్యం లేదా నైపుణ్యం ఇతరుల కంటే శ్రేష్ఠమైనవని వైద్యులు చెప్పుకోరాదని వైద్య నియంత్రణ సంస్థ స్పష్టం చేసింది.

# ఢిల్లీలో భారీగా బలగాల మోహరింపు

**సీజేపీ, ఇండియా కూటమి ఆందోళనలే కారణం**



**న్యూఢిల్లీ: (డ్రీమ్ టైమ్స్)**
ఢిల్లీలో జరుగుతున్న నిరసనలను దృష్టిలో ఉంచుకుని శాంతి భద్రతల పరిరక్షణకు భారీగా భద్రతా దళాలను మోహరించారు. హోంశాఖ తెలిపిన వివరాల ప్రకారం 221 కంపెనీలకు చెందిన సుమారు 21 వేల మందిని ఈ నెల 8-12 మధ్య ఢిల్లీలో మోహరించనున్నారు.వీటిలో కాక్రోచ్ జనతా పార్టీ జూలైలో నిర్వహించిన నిరసనల దృష్ట్యా అందుబాటులో ఉంచిన 111 కంపెనీలు, అక్టోబర్‌లో మంజూరైన 110 కంపెనీలు ఉన్నాయి. ఈ మోహరింపు కోసం సీఆర్‌పీఎఫ్ కంపెనీలను వివిధ ప్రాంతాల నుంచి తరలిస్తున్నారు. శాంతి భద్రతల పరిరక్షణ నిమిత్తం శుక్ర, శనివారాలు రెండు రోజులపాటు ఢిల్లీలో మద్యం దుకాణాలను మూసివేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే, జంతర్ మంతర్ వద్ద ఎలాంటి నిరసనకూ అనుమతి ఇవ్వలేదని ఢిల్లీ పోలీసులు తెలిపారు.

# అమెజాన్‌లో మళ్లీ లేఆఫ్స్..

**- వెయ్యి మంది తొలగింపు..**

**-మొత్తం 30 వేల మందిని తొలగించే యోచన..!**




**న్యూఢిల్లీ: (డ్రీమ్ టైమ్స్)**
ప్రముఖ ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ మరోసారి భారీగా ఉద్యోగులను తొలగించింది. ఈసారి ప్రపంచవ్యాప్తంగా వెయ్యిమందికి పైగా ఉద్యోగులను తొలగించినట్లు ప్రకటించింది. భారత్, అమెరికా , యూకే సహా పలు దేశాల్లోని రిటైల్ బృందాలపై ఈ లేఆఫ్స్ ప్రభావం పడింది. రానున్న రోజుల్లో దాదాపు 30 వేల మంది ఉద్యోగులను తొలగించాలనే విస్తృత ప్రణాళికలో భాగంగానే ఈ తాజా ఉద్యోగుల కోతలు ఉన్నాయని కంపెనీ వర్గాలు తెలిపాయి.ఈ-కామర్స్ వెబ్‌సైట్‌ను పర్యవేక్షించే 'స్టోర్స్' వ్యాపార విభాగానికి చెందిన ఉద్యోగులను తాజాగా తొలగించినట్లు రాయిటర్స్, బిజినెస్ ఇన్‌సైడర్ నివేదికలు పేర్కొన్నాయి. తమ ప్రాధాన్యతలను మెరుగ్గా చేరుకోవడానికి వీలుగా స్టోర్స్ బిజినెస్‌లో కొన్ని సర్దుబాట్లు చేశామని అమెజాన్ ప్రతినిధి ఒకరు రాయిటర్స్‌కు వివరించారు. అయితే ఎంతమందిని తొలగించారనే కచ్చితమైన సంఖ్యను కంపెనీ వెల్లడించలేదు. మరోవైపు కరోనా మహమ్మారి సమయంలో అవసరానికి మించి ఉద్యోగులను నియమించుకోవడమే ప్రస్తుత తొలగింపులకు కారణమని అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ అన్నారు. కరోనా సమయంలో ప్రజలు ఇళ్లకే పరిమితమై ఎక్కువగా ఆర్డర్లు చేశారని, అది తమకు చాలా ఒత్తిడితో కూడిన కాలమని, అందుకే అవసరానికి మించి ఉద్యోగులను తీసుకున్నామని 'ఫాక్స్ న్యూస్' కు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో బెజోస్ పేర్కొన్నారు. కాగా భారత్‌లో 'అమెజాన్ గ్రేట్ ఇండియన్' ఫెస్టివల్ సేల్.. ప్రపంచవ్యాప్తంగా 'ప్రైమ్ బిగ్ డీల్ డేస్' సేల్ ప్రారంభమైన తరుణంలోనే ఈ లేఆఫ్‌లు జరగడం గమనార్హం. మంగళవారం రోజున ఉద్యోగులకు ఈ-మెయిల్ ద్వారా వారిని ఉద్యోగం నుంచి తొలగిస్తున్నట్లు కంపెనీ ఉన్నతాధికారులు సమాచారం అందించారు. దాంతో ప్రభావిత ఉద్యోగులు కంపెనీ అంతర్గత స్లాక్ ఛానెల్‌లో సెవరెన్స్ ప్యాకేజీ, నోటీస్ పీరియడ్, ఇతర అవకాశాలపై చర్చించుకున్నట్లు సమాచారం. ఒకవైపు ఉద్యోగులను తొలగిస్తున్నప్పటికీ మరోవైపు అమెజాన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమవుతోంది.

# బ్యాలట్‌ను బలహీనపరిస్తే అరాచకం వ్యాప్తి

**కాంగ్రెస్, సీజేపీపై పరోక్ష విమర్శలు ● 42 మంది రిటైర్డ్ జడ్జిల లేఖ**




**న్యూఢిల్లీ: (డ్రీమ్ టైమ్స్)**
ఎన్నికల సంఘం, ఇతర సంస్థలను బలహీనపరిచే ప్రయత్నాలను వ్యతిరేకిస్తూ 42 మంది రిటైర్డ్ జడ్జిల బృందం ఒక బహిరంగ లేఖ రాసింది. ఇటువంటి ప్రయత్నాలు ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తాయని, బ్యాలెట్‌కు అర్థం పోయినప్పుడు అరాచకం ప్రబలుతుందని వారు వాదించారు. ఒక కట్టుకథతో అశాంతి మొదలవుతుంది. ఆ తర్వాత ఏర్పడిన శూన్యాన్ని అరాచక, విద్రోహ శక్తులు ఆక్రమిస్తాయి.కొన్ని అంతర్గతంగా, కొన్ని సరిహద్దుల ఆవల నుంచి సూచనలు తీసుకుంటాయి అని సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు, ఓటర్ల జాబితా సవరణకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు భారీ నిరసనలు చేస్తున్న నేపథ్యంలో వచ్చిన ఆ లేఖలో పేర్కొన్నారు. రాజ్యాంగ పదవుల్లో ఉన్న అధికారులను పదేపదే 'దొంగలు', 'రాజీపడిన వారి'గా ముద్ర వేయడాన్ని వారు తీవ్రంగా వ్యతిరేకించారు. సర్ పక్రియను సమర్థిస్తూ అది ఓటర్ల జాబితాలను నిర్దిష్టంగా, లోపరహితంగా ఉంచే లక్ష్యంతో చేపట్టే చట్టబద్ధమైన ప్రక్రియ అని వారు పేర్కొన్నారు.

# వలస వెళ్లిన మహిళల పిల్లలకూ బంగారు ఉంగరం!

**తాత, బామ్మలు తమిళనాడులో శాశ్వత నివాసం ఉంటే అమలు**



**చెన్నై:(డ్రీమ్ టైమ్స్)**
నవజాత శిశువులకు బంగారు ఉంగరం అందించే పథకం నిబంధనలను తమిళనాడు ప్రభుత్వం బుధవారం సవరించింది. దాని ప్రకారం తమిళనాడుకు చెందిన మహిళలు పెండ్లి తర్వాత వేరే రాష్ట్రాలకు వలస వెళ్లినా, చిన్నారుల తాత, బామ్మలు తమిళనాడులో శాశ్వత నివాసం కలిగి ఉంటే.. అలాంటి వారికీ ఈ పథకం వర్తిస్తుంది.సవరించిన మార్గ దర్శకాల ప్రకారం.. తమిళనాడు మహిళలు వేరే రాష్ట్రంలో నివసిస్తున్నా ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవిస్తే.. వారి పిల్లలకు బంగారు ఉంగరం అందిస్తారు. అయితే పిల్లల తాత, బామ్మలు తమిళనాడులో శాశ్వత నివాసం కలిగి ఉన్నట్టు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉంటుంది.

# భారత్ ఐటీ కంపెనీలకు ట్రంప్ షాక్

**శాశ్వత కార్మిక ధ్రువీకరణ రద్దు చేస్తూ ఉత్తర్వులు**



**న్యూఢిల్లీ, అక్టోబర్ 8: (డ్రీమ్ టైమ్స్)**
అమెరికా, భారత్‌కు చెందిన పలు ఐటీ సంస్థలకు ట్రంప్ ప్రభుత్వం షాక్ ఇచ్చింది. హెచ్-1బీ వీసా కార్మికులకు గ్రీన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవడానికి కంపెనీలను అనుమతించే శాశ్వత కార్మిక ధ్రువీకరణ కార్యక్రమం నుంచి కాగ్నిజెంట్, ఇన్ఫోసిస్, కాగ్నిజెంట్, టాటా, విప్రో, హెచ్‌సీఎల్, క్యాప్ జెమినీ, మైక్రోసాఫ్ట్ అడోబ్‌లను అమెరికా రద్దు చేసింది.ఈ మేరకు యూఎస్ కార్మిక శాఖ మంత్రి కీత్ శాండరింగ్, దేశ ఉపాధ్యక్షుడు జేడీ వ్యాన్స్ ఒక ప్రకటన చేశారు. ఈ కంపెనీలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పర్మినెంట్ లేబర్ సర్టిఫికేషన్ దరఖాస్తులను ఇకపై పరిశీలించబోమని తెలిపింది. 2009 నుంచి కేవలం ఈ సంస్థల నుంచే 30 లక్షల మంది విదేశీ కార్మికులకు సంబంధించి వినతులు వచ్చాయని చెప్పారు. ఇలా ఈ సంస్థలు వందలు, వేల ఉద్యోగాలను అమెరికా కార్మికులకు దక్కకుండా అడ్డుకున్నాయని వారు వ్యాఖ్యానించారు.

# బీజేపీకి నవీన్ పట్నాయక్ ఝలక్

**ఇండియా కూటమి ఆందోళనల్లో బీజేడీ**




**న్యూఢిల్లీ (డ్రీమ్ టైమ్స్)**
ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ(సర్) ప్రక్రియలో భారీగా అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలంటూ ఢిల్లీలో ఇండియా కూటమి చేపట్టిన నిరసన ర్యాలీలో బిజూ జనతాదళ్(బీజేడీ) పాల్గొంది. పార్టీ అధినేత నవీన్ పట్నాయక్ ఆదేశాలతో రాజ్యసభ ఎంపీలు మానస్ మంగరాజ్, సులతా దేవ్ ప్రదర్శనలో భాగస్వాములయ్యారు.ఎస్ఐఆర్ పేరుతో ఒడిశాలో 20 లక్షలకు పైగా, దేశవ్యాప్తంగా దాదాపు 13 కోట్ల మంది ఓటర్లను ఉద్దేశపూర్వకంగా తొలగించారని బీజేడీ నేతలు ఆరోపించారు. తాము అధికారికంగా ఇండియా కూటమిలో చేరలేదని స్పష్టం చేసినప్పటికీ, బీజేపీని వీడి, విపక్షాలతో గళం కలపడం జాతీయ రాజకీయాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది. 2024 ఎన్నికల్లో బీజేపీ చేతిలో ఎదురైన పరాభవమే బీజేడీ రాజకీయ వైఖరిలో మార్పునకు ప్రధాన కారణమని తెలుస్తున్నది.

# కెనడియన్ కవయిత్రి అన్నే కార్సన్‌కు సాహిత్య నోబెల్ పురస్కారం

**న్యూఢిల్లీ(డ్రీమ్ టైమ్స్)**
కెనడాకు చెందిన ప్రముఖ కవయిత్రి, వ్యాసకర్త అన్నే కార్సన్ ప్రతిష్టాత్మక సాహిత్య నోబెల్ బహుమతిని గెలుచుకున్నారు. ఆమె సాగించిన సృజనాత్మక రచనలకు గుర్తింపుగా స్వీడిష్ అకాడమీ ఈ పురస్కారాన్ని ప్రకటించింది. అకాడమీ శాశ్వత కార్యదర్శి ఇంగ్రిడ్ కార్ల్‌బర్గ్ ఈ సమాచారం అందించే సమయానికి ఆమె ఐస్‌ల్యాండ్‌లో ఉన్నారు.ఈ పురస్కార ప్రకటన తనకు ఎంతో ఆశ్చర్యం కలిగించిందని 76 ఏండ్ల కార్సన్ పేర్కొన్నారు. ఈ ఏడాది నోబెల్ పురస్కార గ్రహీతలకు 12 మిలియన్



స్వీడిష్ క్రోనార్లు(సుమారు 1.2 మిలియన్ డాలర్లు) అందుతాయి. టొరంటోలో జన్మించిన అన్నే కార్సన్ ప్రాచీన గ్రీక్, రోమన్ సాహిత్య నేపథ్యాలను కవిత్వం, వ్యాసాలు, కల్పనా రూపాలలో మేళవించి రచనలు చేయడంలో గుర్తింపు పొందారు.

# యూపీఐ ఛార్జీలకు బ్రేక్?

**-రూ.2,000 దాటిన లావాదేవీలపై రుసుము వాయిదా?**
**-జనవరి వరకు పొడిగించే యోచనలో కేంద్రం**
**-పండగల వేళ వ్యాపారులపై భారం పడకుండా చర్యలు**
**-వినియోగదారులు నేరుగా రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు**
**-చెల్లింపుల సంస్థలకు సాంకేతిక మార్పులకు అదనపు సమయం**
**-ఆగస్టులో రూ.29.82 లక్షల కోట్ల లావాదేవీలు**

న్యూఢిల్లీ



యూపీఐ ద్వారా జరిగే రూ.2,000 కంటే ఎక్కువ విలువైన లావాదేవీలపై ప్రతిపాదించిన రుసుము అమలు వాయిదా పడే అవకాశం కనిపిస్తోంది. పండగల సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం. దీనిపై త్వరలోనే అధికారికంగా స్పష్టత వచ్చే అవకాశం ఉంది. రూ.2,000 కంటే ఎక్కువ విలువైన వ్యాపార సంబంధిత యూపీఐ లావాదేవీలపై 0.4 శాతం రుసుమును అక్టోబర్ 15 నుంచి అమలు చేయాలని జాతీయ చెల్లింపుల సంస్థ ప్రతిపాదించింది. అయితే ఈ గడువును వచ్చే ఏడాది జనవరి వరకు పొడిగించే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో చెల్లింపుల సంస్థలకు తమ సాంకేతిక వ్యవస్థలను మెరుగుపర్చుకునేందుకు మరింత సమయం లభించనుంది. పండగల సీజన్‌లో వ్యాపారులపై అదనపు రుసుము భారం పడకుండా చూడటం కూడా ఈ నిర్ణయం వెనుక ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఆరేళ్లకుపైగా ఎలాంటి రుసుము లేకుండా కొనసాగుతున్న యూపీఐ చెల్లింపులపై ఇప్పుడు ఈ రుసుమును ప్రతిపాదించారు. అయితే ఇది వినియోగదారులు నేరుగా చెల్లించాల్సిన రుసుము కాదు. వ్యాపారుల వైపు నుంచి చెల్లించాల్సిన అంతర్గత మార్పిడి రుసుముగా దీనిని ప్రతిపాదించారు. ప్రస్తుతం దేశంలో 50 కోట్లకుపైగా యూపీఐ వినియోగదారులు ఉన్నారు. 2026 ఆగస్టులోనే యూపీఐ ద్వారా రూ.29.82 లక్షల కోట్ల విలువైన 2,451 కోట్ల లావాదేవీలు జరిగాయి. దీంతో దేశంలో డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో యూపీఐ ఎంత కీలకంగా మారిందో అర్థమవుతోంది. అక్టోబర్ 15 నుంచే రుసుము అమలు చేస్తే దసరా, దీపావళి వంటి ప్రధాన పండగల సమయంలో వినియోగదారుల కొనుగోళ్లపై ప్రభావం పడే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నట్లు సమాచారం. ఈ సమయంలో చెల్లింపుల్లో ఎలాంటి అంతరాయం కలగకుండా చూడటంతో పాటు వ్యాపారులపై అదనపు భారం పడకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు అదనపు గడువు లభిస్తే చెల్లింపుల సంస్థలు తమ సాంకేతిక వ్యవస్థలను మరింత మెరుగుపర్చుకునేందుకు అవకాశం ఉంటుంది. రుసుము భారాన్ని వినియోగదారులపై మోపకుండా ఎలా సర్దుబాటు చేయాలనే అంశంపై కూడా ఈ సంస్థలు ప్రణాళిక రూపొందించుకోగలవు. అయితే రుసుము అమలు ఎప్పటి నుంచి ఉంటుందనే అంశంపై కేంద్రం నుంచి అధికారిక ప్రకటన వెలువడే వరకు స్పష్టత ఉండనుంది.

## సీఈసీ జ్ఞానేశ్‌కు అదనపు భద్రత



న్యూఢిల్లీ

కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు అదనపు భద్రత కల్పించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సీఐఎస్ఎఫ్) సిబ్బందితో ఆయనకు రక్షణ పెంచినట్లు తెలిపాయి. 'సర్' ప్రక్రియలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ విపక్షాలు, యువత, విద్యార్థులు ఆందోళనలు చేస్తున్న నేపథ్యంలో ఈ చర్య తీసుకున్నట్లు సమాచారం. జ్ఞానేశ్ కుమార్‌కు ఇప్పటికే జెడ్ ప్లస్ కేటగిరీ భద్రత ఉంది. తాజాగా అదనపు భద్రతా సిబ్బందిని మోహరించడంతో ఆయనకు రక్షణ మరింత పెరిగింది. ఎన్నికల సంఘం కార్యాలయంతో పాటు ఆయన నివాసం వద్ద కూడా భద్రతా ఏర్పాట్లను కట్టుదిట్టం చేసినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. సీఈసీ నివాసం వద్ద 24 గంటల పాటు పోలీసుల కాపలా ఉండేలా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నాయి. ప్రస్తుత ముప్పు అంచనా ఆధారంగానే అదనపు భద్రత కల్పించాలని నిర్ణయించినట్లు వివరించాయి. అయితే, భద్రత పెంపునకు సంబంధించి అధికారికంగా మరిన్ని వివరాలు వెల్లడికావాల్సి ఉంది.

## గోదారి-కావేరిని కలపండి!

మొదటి తరువాయి

గోదావరి- కావేరి నదుల అనుసంధానం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రధానికి సీఎం వివరించారు.దేశవ్యాప్తంగా రహదారుల నెట్‌వర్క్, పవర్‌గ్రిడ్ వంటివి ఎన్డీఏ ప్రభుత్వాల హయాంలోనే జరిగాయని.. ఇప్పుడు నదుల అనుసంధాన ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తే వాటర్ గ్రిడ్ ఏర్పాటుకు మార్గం సుగమం అవుతుందని సీఎం చంద్రబాబు వివరించారు. 2027లో జరిగే గోదావరి పుష్కరాలకు రాష్ట్రంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని, పుష్కరాల కోసం చేపట్టిన అభివృద్ధి ప్రాజెక్టులకు ఆర్థిక సాయం అందించాలని కోరారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా... దేశ విదేశాల నుంచి సైతం గోదావరి పుష్కరాలకు భక్తులు తరలి వస్తారని సీఎం వివరించారు. రాష్ట్రంలో మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు కేంద్ర సహకారం అందించాలని ప్రధాని మోదీకి సీఎం చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. రాజధాని అమరావతిలో చేపడుతున్న ఔటర్ రింగ్ రోడ్డు వంటి అంశాలపై ప్రధాని మోదీతో చర్చించారు. విశాఖ మెట్రోను మంజూరు చేయాలని కోరారు. బీచ్ రోడ్డు నిర్మాణం ఆవశ్యకతను వివరించారు. రాష్ట్రంలో అందరికీ అభివృద్ధి ఫలాలు సమానంగా అందేలా అమలు చేస్తున్న స్వర్ణాంధ్ర-2047 విజన్ గురించి ప్రధానికి తెలిపారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో 53 శాతం లోటు వర్షపాతం నమోదైందని, వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం పడిందని చెప్పారు. కరువు నష్టాన్ని తగ్గించేందుకు రాష్ట్రప్రభుత్వ పరంగా తీసుకుంటున్న చర్యలను ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల మదనపల్లె కేంద్రంగా ప్రారంభించిన గ్లోబల్ హార్టికల్చర్ హబ్ లక్ష్యాలను కూడా వివరించారు. అలాగే ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ తరహాలో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశామని తెలిపారు.

## శభాష్.. ఏపీ!

మొదటి తరువాయి

ద్వారా ఇప్పటివరకు 10,817 కేసులు నమోదయ్యాయి. గతంలో అనుసరించిన విధానంలో రూ.366 కోట్ల మేర పన్ను వ్యత్యాసాలు గుర్తించగా, కొత్త సాంకేతికత సాయంతో ఏకంగా రూ.743 కోట్ల పన్ను ఎగవేతలను గుర్తించినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. గతంలో ఒక్కో కేసులో సగటున రూ.3.08 లక్షల పన్ను వసూలు కాగా, ఏఐ నిఘా పెరిగిన తర్వాత ఆ మొత్తం రూ.27.63 లక్షలకు చేరింది. ఏపీ అనుసరిస్తున్న ఈ విధానంపై రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, అసోం, ఢిల్లీ, ఉత్తరాఖండ్ సహా పలు రాష్ట్రాలు అధ్యయనం చేస్తున్నాయి. పన్నుల వ్యవస్థలో పారదర్శకత, సమర్థతను పెంచేందుకు ఇతర రాష్ట్రాలు కూడా ఏపీ విధానాలను పరిశీలించాలని జీఎస్టీ కౌన్సిల్ సిఫారసు చేసింది.

# నేడు వెస్టిండీస్‌తో రెండో టీ20

**-తొలి మ్యాచ్‌లో 8 వికెట్లతో భారత్ ఘన విజయం**
**-శతకంతో చెలరేగిన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్**
**-జోరుమీదున్న టీమిండియా బ్యాటర్లు**
**-మరో గెలుపే లక్ష్యంగా బరిలోకిలి**
**-తొలి విజయం కోసం విండీస్ ఆరాటం**
**-రాత్రి 7గం. నుంచి స్టార్ స్పోర్ట్స్, జియోహాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం**




రాంచీ: సొంతగడ్డపై వెస్టిండీస్‌తో జరుగుతున్న పోరులో భారత జట్టు జోరు కొనసాగిస్తోంది. ఇప్పటికే వన్డే సిరీస్‌ను కైవసం చేసుకున్న టీమిండియా, ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లోనూ శుభారంభం చేసింది. లక్నో వేదికగా జరిగిన తొలి మ్యాచ్‌లో ఎనిమిది వికెట్ల తేడాతో వెస్టిండీస్‌ను ఓడించింది. ఇప్పుడు రాంచీ వేదికగా నేడు జరిగే రెండో టీ20లోనూ గెలిచి సిరీస్‌లో 2-0 ఆధిక్యం సాధించాలని పట్టుదలతో ఉంది. మరోవైపు తొలి మ్యాచ్‌లో చేసిన తప్పులను సరిదిద్దుకొని ఈసారి విజయం సాధించడం ద్వారా సిరీస్‌ను సమం చేయాలని కరీబియన్ జట్టు భావిస్తోంది. దీంతో రెండో టీ20పై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. తొలి మ్యాచ్‌లో శతకంతో చెలరేగిన శ్రేయస్ అయ్యర్ మరోసారి తన బ్యాటింగ్ ప్రతాపాన్ని చూపించాలని చూస్తున్నాడు. లక్నోలో కేవలం 43 బంతుల్లోనే అజేయంగా 102 పరుగులు చేసి జట్టుకు ఘన విజయాన్ని అందించడంలో కీలక పాత్ర పోషించాడు. తాజా టీ20 ర్యాంకింగ్స్‌లోనూ కెరీర్‌లోనే అత్యుత్తమంగా ఏడో స్థానానికి చేరుకున్నాడు. అతడితో పాటు ఇషాన్ కిషన్ కూడా మంచి ఫామ్‌లో ఉండటం భారత్‌కు కలిసొచ్చే అంశం. ప్రత్యర్థి బౌలర్లపై ఎదురుదాడికి దిగుతూ పరుగుల వరద పారిస్తున్న ఇషాన్.. రెండో మ్యాచ్‌లోనూ భారీ ఇన్నింగ్స్ ఆడాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. మరోవైపు యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీకి తుది జట్టులో అవకాశం లభిస్తుందా? అన్నది ఆసక్తికరంగా మారింది. ఇటీవల వరుసగా తక్కువ పరుగులకే వెనుదిరుగుతున్న సంజూ శాంసన్ స్థానంలో వైభవ్‌ను ఆడించాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే జట్టు యాజమాన్యం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది చూడాలి. మిడిలార్డర్‌లో తిలక్ వర్మ, శివమ్ దూబే వంటి ఆటగాళ్లు ఉండటం భారత్‌కు బలం. బౌలింగ్‌లో నమన్ ధీర్, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్ స్పిన్ బాధ్యతలను పంచుకోనున్నారు. పేస్ విభాగంలో అర్ష్‌దీప్ సింగ్ కీలకం కానున్నాడు.తొలి మ్యాచ్‌లో వెస్టిండీస్ తరఫున కెప్టెన్ షాయ్ హోప్, షెర్ఫాన్ రూథర్‌ఫోర్డ్ అర్ధశతకాలతో రాణించారు. అయితే మిగిలిన బ్యాటర్లు ఆశించిన స్థాయిలో ఆడకపోవడంతో జట్టుకు భారీ స్కోరు సాధించే అవకాశం లేకుండా పోయింది. బౌలింగ్ విభాగం కూడా భారత బ్యాటర్లను కట్టడి చేయలేకపోయింది. ఈ నేపథ్యంలో రెండో టీ20లో బ్యాటర్లు, బౌలర్లు సమష్టిగా రాణించాల్సిన అవసరం విండీస్‌కు ఉంది. భారత జట్టును నిలువరించాలంటే ఆరంభం నుంచే ఒత్తిడి పెంచడంతో పాటు కీలక సమయాల్లో వికెట్లు తీయడం తప్పనిసరి. రాంచీలో ఏ జట్టు పైచేయి సాధిస్తుందో చూడాలి.

జట్లు (అంచనా)

భారత్: అభిషేక్ శర్మ, సంజూ శాంసన్ (వికెట్ కీపర్), ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), తిలక్ వర్మ, శివమ్ దూబే, నమన్ ధీర్, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, మయాంక్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్.

వెస్టిండీస్: షాయ్ హోప్ (కెప్టెన్, వికెట్ కీపర్), కైల్ మేయర్స్, షిమ్రాన్ హెట్మైర్, రోవ్‌మన్ పొవెల్, షెర్ఫాన్ రూథర్‌ఫోర్డ్, రొమారియో షెఫర్డ్, రోస్టన్ చేజ్, మాథ్యూ ఫోర్డే, అకీల్ హొసేన్, షమార్ జోసెఫ్, షమార్ స్ప్రింగర్

# సూపర్ ఎల్‌నినోతో భూగోళం భగభగలు!

**-ప్రపంచవ్యాప్తంగా పెరగనున్న ఎండల తీవ్రత**
**-వాతావరణ మార్పులపై ఐక్యరాజ్యసమితి హెచ్చరిక**
**-1950 తర్వాత అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే ప్రమాదం**
**-పసిఫిక్ సముద్రంలో పెరుగుతున్న వేడి ప్రభావం**
**-2027 ఫిబ్రవరి వరకు ఎల్‌నినో ప్రభావం ఉండే అవకాశం**
**-మధ్య, తూర్పు పసిఫిక్‌లో సముద్ర వేడిమి పెరుగుదల**
**-ప్రపంచవ్యాప్తంగా వాతావరణంలో తీవ్ర మార్పులు**
**-ఎల్‌నినోతో అదనపు మరణాలు సంభవించే ప్రమాదమని పరిశోధకుల అంచనా**




న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా ఎండల తీవ్రత మరింత పెరిగే ప్రమాదం ఉందా? సూపర్ ఎల్‌నినో పరిస్థితులు ఏర్పడితే భూగోళం మరింత వేడెక్కుతుందా? ప్రస్తుతం వాతావరణ నిపుణులను ఆందోళనకు గురిచేస్తున్న ప్రశ్నలివి. మానవ కార్యకలాపాల వల్ల ఇప్పటికే వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులకు ఎల్‌నినో ప్రభావం తోడైతే పరిస్థితులు మరింత తీవ్రంగా మారే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రపంచ వాతావరణ సంస్థ కూడా రానున్న కాలంలో వాతావరణ పరిస్థితులపై అప్రమత్తత అవసరమని సూచించినట్లు సమాచారం. పసిఫిక్ సముద్రంలో ఉపరితల ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల ఎల్‌నినో పరిస్థితులు ఏర్పడతాయి. దీని ప్రభావం ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో వర్షపాతం, ఉష్ణోగ్రతలు, గాలుల తీరుపై పడుతుంది. కొన్ని ప్రాంతాల్లో తీవ్రమైన వేడి, మరికొన్ని ప్రాంతాల్లో వర్షాభావం, ఇంకొన్ని చోట్ల అసాధారణ వర్షాలు నమోదయ్యే అవకాశాలు ఉంటాయి. ఎల్‌నినో బలపడితే ఈ మార్పుల తీవ్రత మరింత పెరగవచ్చని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. వాతావరణ నిపుణుడు ర్యాన్ మావూ భూగోళ ఉష్ణోగ్రతలకు సంబంధించిన పటాన్ని విడుదల చేశారు. ఇందులో ప్రపంచంలోని అనేక ప్రాంతాలు ఎరుపు రంగులో కనిపిస్తున్నాయని, భూమి విస్తృతంగా వేడెక్కుతున్న పరిస్థితులను ఇది సూచిస్తోందని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావం 2027 ఫిబ్రవరి వరకు కొనసాగవచ్చన్న అంచనాలను కూడా ఆయన ప్రస్తావించారు. మరో వాతావరణ నిపుణుడు జేకీ హౌజ్‌ఫాదర్ ఎల్‌నినో ప్రభావంతో ప్రపంచ ఉష్ణోగ్రతల్లో గణనీయమైన మార్పులు సంభవించే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. మరో నిపుణుడు లియోన్ సైమన్ కూడా ఎల్‌నినో మరింత బలపడి సూపర్ ఎల్‌నినో స్థాయికి చేరే అవకాశాన్ని ప్రస్తావించారు. అయితే ఈ అంచనాలు ఎంతవరకు నిజమవుతాయన్నది రానున్న నెలల్లో నమోదయ్యే సముద్ర, వాతావరణ పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. ప్రపంచ వాతావరణ సంస్థ అంచనాల ప్రకారం అక్టోబర్ నుంచి డిసెంబర్ మధ్య మధ్య, తూర్పు పసిఫిక్ ప్రాంతాల్లో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. ఈ ప్రాంతాల్లో ఉష్ణోగ్రతల పెరుగుదల ప్రపంచవ్యాప్తంగా వాతావరణ పరిస్థితులపై ప్రభావం చూపవచ్చు. ఫలితంగా వ్యవసాయం, నీటి లభ్యత, ప్రజారోగ్యం వంటి రంగాలపై ఒత్తిడి పెరిగే ప్రమాదం ఉంది. ఎల్‌నినో ప్రభావం వల్ల అధిక వేడి కారణంగా మరణాల సంఖ్య కూడా పెరిగే అవకాశాలున్నాయని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. జూన్ 2026 నుంచి ఫిబ్రవరి 2027 మధ్య ప్రపంచవ్యాప్తంగా సుమారు ఐదు లక్షల అదనపు మరణాలు సంభవించవచ్చని చికాగో విశ్వవిద్యాలయ పరిశోధకులు అంచనా వేసినట్లు కథనంలో పేర్కొన్నారు. అయితే ఈ అంచనాకు సంబంధించిన పరిశోధన వివరాలు, లెక్కింపు పద్ధతులను విడిగా ధ్రువీకరించాల్సి ఉంది. మొత్తంగా ఎల్‌నినో బలపడితే ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో వేడి తీవ్రత, వర్షపాతంలో మార్పులు సంభవించే అవకాశం ఉంది. వాతావరణ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించడం, అధిక వేడి నుంచి ప్రజలను రక్షించేందుకు ముందస్తు చర్యలు తీసుకోవడం కీలకంగా మారనుంది.

# వ్యక్తులు కాదు.. వ్యవస్థే ముఖ్యం!

మొదటి తరువాయి

**ఐటీడీపీ పనితీరుపై సమీక్ష**

గురువారం అమరావతిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఐటీడీపీ విభాగం పనితీరుపై నారా లోకేశ్ సమీక్ష నిర్వహించారు. పార్టీకి, ప్రభుత్వానికి మధ్య ఐటీడీపీ వారధిగా నిలవాలని ఈ సందర్భంగా సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పథకాల అమలు తీరును ప్రజలకు వివరించాలని, సోషల్ మీడియాలో ప్రత్యర్థులు చేసే అసత్య ప్రచారాలను వాస్తవాలు, ఆధారాలతో తిప్పికొట్టాలని స్పష్టం చేశారు.

**కమిటీల నియామకాలు త్వరగా పూర్తి చేయాలి**

ఐటీడీపీ కమిటీల నియామక ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని నారా లోకేశ్ ఆదేశించారు. విభాగంలోని ప్రతి సభ్యుడినీ 'మై టీడీపీ యాప్'తో అనుసంధానించాలని సూచించారు. పార్టీ కార్యకలాపాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సభ్యుల మధ్య సమన్వయం పెంచాలని, బాధ్యతలను వ్యవస్థీకృతంగా నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు.

**సాంకేతికతతో పార్టీ బలోపేతం**

పార్టీలోని ఇతర విభాగాలతో సమన్వయం చేసుకుంటూ ఐటీడీపీ ముందుకు సాగాలని లోకేశ్ ఆకాంక్షించారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని పార్టీ సమాచారాన్ని ప్రజలకు చేరవేయడంలో చురుగ్గా వ్యవహరించాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ముఖ్యనేత చింతకాయల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## సుప్రీంకోర్టు తీర్పు రాగానే స్థానిక ఎన్నికలు!

మొదటి తరువాయి

**గత రెండు నెలలుగా ఎన్నికల ఏర్పాట్లపై కసరత్తు**

అనంతరం ఆయన మాట్లాడుతూ... గత రెండు నెలలుగా ఎన్నికల ఏర్పాట్లపై కసరత్తు చేస్తున్నామని, అధికారులు అన్ని విధాలా సన్నద్ధంగా ఉన్నారని వివరించారు.ఈ ఎన్నికలను బ్యాలెట్ పేపర్ల విధానంలోనే నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

**ఎన్నికలకు ప్రామాణికంగా 2026 ఫిబ్రవరి 5వ తేదీ నాటి ఫొటో ఓటర్ల జాబితా**

2026 ఫిబ్రవరి 5వ తేదీ నాటి ఫొటో ఓటర్ల జాబితాను ఈ ఎన్నికలకు ప్రామాణికంగా తీసుకోనున్నట్లు వెల్లడించారు.

బ్యాలెట్ పేపర్ల ముద్రణకు అవసరమైన ప్రింటింగ్ ప్రెస్‌ను కూడా త్వరలో ఖరారు చేయనున్నట్లు తెలిపారు.

## బెంగళూరులో సీజేపీ భారీ నిరసన



బెంగళూరు:

ఓటర్ల జాబితా, ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నాయంటూ సీజేపీ చేపట్టిన నిరసనలు బెంగళూరుకు చేరాయి. నగరంలో నిర్వహించిన ఆందోళనలో సీజేపీ ఆవిష్కర్త అభిజిత్ దీప్కే, నటుడు ప్రకాశ్ రాజ్, సామాజిక మాధ్యమాల ప్రముఖుడు ధ్రువ్ రాఠీ పాల్గొన్నారు. ఎన్నికల పారదర్శకతను కాపాడాలని, ఓటర్ల హక్కులను పరిరక్షించాలని వారు డిమాండ్ చేశారు. నిరసనలో మాట్లాడిన అభిజిత్ దీప్కే.. ఎన్నికల్లో ఓట్ల చోరీ జరిగిందని ప్రధాని నరేంద్ర మోదీపై ఆరోపణలు చేశారు. బతికున్నవారిని ఓటర్ల జాబితాలో చనిపోయినవారిగా చూపించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. బీజేపీ 'ఒక దేశం.. ఒక ఎన్నిక' నినాదం వెనుక 'ఒక దేశం.. ఒక పార్టీ' లక్ష్యం ఉందని ఆరోపించారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ మధ్య ఓట్ల తేడా కేవలం రెండు శాతమేనని ప్రస్తావిస్తూ ఎన్నికల ఫలితాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. నటుడు ప్రకాశ్ రాజ్ మాట్లాడుతూ.. ఓటర్ల పేర్లను చేర్చేందుకు గతంలో అధికారులు ఇంటింటికీ వెళ్లేవారని, ఇప్పుడు తమ పేర్లు తొలగించకుండా ఉండేందుకు ఓటర్లు అధికారులను అభ్యర్థించాల్సిన పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. ఎస్ఐఆర్ విధానం ద్వారా ఎవరు ఓటు వేయాలో ప్రభుత్వమే నిర్ణయించే పరిస్థితి వస్తోందని ఆరోపించారు. ఈ విధానాన్ని రద్దు చేయాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై కేసు నమోదు చేయాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. కార్యక్రమం సందర్భంగా పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు.

## నోబెల్ శాంతి బహుమతికి నేను అర్హుడిని!

న్యూఢిల్లీ:



నోబెల్ శాంతి బహుమతిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తన ఆకాంక్షను బయటపెట్టుకున్నారు. తాను ఎనిమిది యుద్ధాలను ఆపానని, శాంతి బహుమతి పొందేందుకు అన్ని విధాలా అర్హుడినని పేర్కొన్నారు. తాను గొప్పలు చెప్పుకోవడం లేదని, చేసిన పనుల గురించే మాట్లాడుతున్నానని వ్యాఖ్యానించారు. అయితే ఈ ఏడాది పురస్కారం తనకు వస్తుందన్న నమ్మకం మాత్రం తక్కువగా ఉందని అన్నారు. గతంలో ఏ అమెరికా అధ్యక్షుడూ చేయని పనులను తాను చేశానని ట్రంప్ పేర్కొన్నారు. అనేక యుద్ధాలకు పరిష్కారం చూపించానని, ప్రపంచంలో శాంతి నెలకొల్పేందుకు కృషి చేశానని చెప్పారు. ఇప్పటివరకు ఎనిమిది యుద్ధాలను ఆపినందున నోబెల్ శాంతి బహుమతికి తాను అర్హుడినని అభిప్రాయపడ్డారు. నోబెల్ కమిటీ నిర్ణయంపై కూడా ట్రంప్ వ్యాఖ్యలు చేశారు. పురస్కారంపై కమిటీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో తనకు తెలియదన్నారు. తనలాంటి వారికి నోబెల్ శాంతి బహుమతి ఇవ్వకపోవడం కమిటీకి అలవాటుగా మారినట్లు కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. ప్రతి ఏడాది నార్వేకు చెందిన నోబెల్ కమిటీ శాంతి బహుమతిని ప్రకటిస్తుంది. 2026 సంవత్సరానికి సంబంధించిన పురస్కారాన్ని అక్టోబర్ 9న ప్రకటించనున్న నేపథ్యంలో ట్రంప్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. గత ఏడాది కూడా ట్రంప్ నోబెల్ శాంతి బహుమతిపై ఆశలు పెట్టుకున్నారు. అయితే ఆ పురస్కారం వెనెజువెలా ప్రతిపక్ష నాయకురాలు మరియా కొరీనా మచాడోకు దక్కింది. దీంతో ట్రంప్‌కు నిరాశ ఎదురైంది.

# సంపాదకీయం

## నోబెల్ పై ట్రంప్ ఆశలు



ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన నోబెల్ బహుమతి ఈ సారి ఎవరిని వరించనుంది? ఈ శాంతి బహుమతి కోసం పలువురి మధ్య కీలక పోటీ నెలకొంది. ముఖ్యంగా ప్రపంచ శాంతి, మానవతా సంక్షోభాలపై నిరంతరం దౌత్యపరమైన పిలుపునిస్తున్న పోప్ లియోతో పాటు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొడిమిర్ జెలెన్స్కీ, కెనడా ప్రధాని మార్క్ కార్నే, నార్డిక్ ప్రజాప్రతినిధులు లీసా మౌర్యోస్కీ, అజా చెమినిట్జ్‌లు నామినేట్ అయినవారిలో ఉన్నారు. రష్యా దండయాత్రకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్యాన్ని, శాంతిని కాపాడేందుకు చేస్తున్న ప్రయత్నాలకు గానూ ఉక్రెయిన్ అధ్యక్షుడు పేరు గత కొన్నాళ్లుగా నామినేట్ అవుతోంది. అయితే ఈ ఏడాది నోబెల్ బహుమతుల ప్రకటన కొనసాగుతోంది. ఇప్పటికే మెడిసిన్, ఫిజిక్స్, కెమిస్ట్రీలతో పాటు సాహిత్యంలో విజేతలను ప్రకటించారు. అయితే, శాంతి బహుమతిపై యావత్తు ప్రపంచం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తోంది. శుక్రవారం (అక్టోబరు 8న) విజేతను ప్రకటించనున్నారు. ఈ ఏడాది నోబెల్ శాంతి బహుమతి కోసం 208 మంది, 79 సంస్థలు సహా 287 నామినేషన్లు నమోదయ్యాయి. నోబెల్ కమిటీ నియమాల ప్రకారం అధికారిక నామినేషన్ల జాబితా 50 ఏళ్ల వరకు అత్యంత గోప్యంగా ఉంచుతారు. అయితే, నామినేట్ చేసిన వ్యక్తులు లేదా సంస్థల బహిరంగ ప్రకటనలు, అంతర్జాతీయ మీడియా కథనాలు, నిపుణుల విశ్లేషణల ఆధారంగా ఈ రేసులో ప్రముఖంగా పలు పేర్లు వినిపిస్తున్నాయి. వీటిలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరు కూడా ఉన్నట్టు వెల్లడయ్యింది.నోబెల్ బహుమతి కోసం కొన్నేళ్లుగా విశ్వప్రయత్నాలు చేస్తున్న ట్రంప్.. బహిరంగంగా వ్యాఖ్యలు చేస్తున్న విషయం తెలిసిందే. ట్రంప్ తన మొదటి పదవీకాలం నుంచే నోబెల్ కల కంటున్నారు. అనేక యుద్ధాలను ఆపిన తానే అసలైన శాంతిదూతను అంటూ గొప్పలు చెప్పుకుంటున్నారు. ఇజ్రాయెల్, అరబ్ దేశాల మధ్య అబ్రహమ్ అకార్డ్‌తో చారిత్రక దౌత్య సంబంధాలు కుదిర్చినందుకు శాంతి బహుమతి పలుమార్లు నామినేట్ చేశారు. నార్వే పార్లమెంట్ సభ్యులు, అమెరికా కాంగ్రెస్‌లోని రిపబ్లికన్ ప్రతినిధులు, పాకిస్థాన్ వంటి దేశాలకు చెందిన నాయకులు అనేక సందర్భాల్లో ట్రంప్ పేరును అధికారికంగా ప్రతిపాదించారు. ఈ ఏడాది కూడా శాంతి బహుమతిపై అమెరికా అధ్యక్షుడు గంపెడాశలు పెట్టుకున్నారు. ఇదే సమయంలో 'అయినా నాకు ఇవ్వరు లే' అంటూ నోబెల్ కమిటీపై బాహటంగానే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. 'ఎన్నో యుద్ధాలను ఆపానని, ఈ పురస్కారం నాకే ఇవ్వాలని డిమాండ్ చేస్తున్న ట్రంప్.. నా కృషికి తగిన గుర్తింపు ఇవ్వడం లేదు' అంటూ రసరసలాడుతున్నారు. ఇటీవల నోబెల్ బహుమతుల ప్రకటనకు ముందు కూడా " నేను ఎనిమిది యుద్ధాలను ఆపాను.. నోబెల్ కమిటీ నాకు ఇవ్వకపోతే వారికే అవమానం" అని వ్యాఖ్యానించారు. అమెరికా అధ్యక్షుడైన కొద్ది నెలలకే బరాక్ ఒబామాకు నోబెల్ రావడంపై కూడా పలుసార్లు తన అక్కసు వెళ్లగక్కారు. భారత్‌కు చెందిన ప్యాడ్‌మాన్‌గా గుర్తింపు పొందిన అరుణాచలం మురుగనాథన్ కూడా నామినేట్ అయ్యారు. మహిళల రుతుక్రమ పరిశుభ్రతపై అద్భుతమైన సామాజిక విప్లవాన్ని తెచ్చినందుకు, ఆయన చేసిన కృషికి గానూ బహిరంగంగా నామినేట్ అయినట్టు నివేదికలు పేర్కొన్నాయి. ప్రపంచ వివాదాలు, మానవ హక్కుల ఉల్లంఘనలు, యుద్ధ నేరాలపై చట్టపరమైన జవాబుదారీతనాన్ని పెంపొందించడానికి కృషిచేసిన అంతర్జాతీయ న్యాయస్థానం, అంతర్జాతీయ నేరాల కోర్టు , భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ, అనేక దేశాలు శాంతియుతంగా అంతరిక్ష సహకారాన్ని కొనసాగిస్తున్నందుకు ప్రతీకగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం పేరు కూడా నామినేట్ అయ్యింది. మరోవైపు నోబెల్ శాంతి బహుమతికి తానే పూర్తిగా అర్హుడినని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ప్రకటించుకున్నారు. ఇప్పటివరకు ఏ అమెరికా అధ్యక్షుడూ చేయని విధంగా ప్రపంచ శాంతి కోసం తాను విశేష కృషి చేశానని, ఏకంగా ఎనిమిది యుద్ధాలను ఆపానని ఆయన పాతపాటే పాడారు. నార్వేజియన్ పీస్ కమిటీ శుక్రవారం ఈ అవార్డులను ప్రకటించనున్న నేపథ్యంలో శ్వేతసౌధంలో మీడియాతో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. తనకు నోబెల్ పురస్కారం ఇవ్వకపోతే, అది ఆ కమిటీకే పెద్ద అవమానమని ఆయన అన్నారు. 2009లో మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామాకు నోబెల్ బహుమతి ఎందుకు ఇచ్చారో ఇప్పటికీ ఆయనకే తెలియదంటూ ట్రంప్ ఎద్దేవా చేశారు. గత ఏడాది నోబెల్ శాంతి బహుమతి గ్రహీత, మారియా కొరినా మచాడో ఆ అవార్డుకు తనకంటే ట్రంపే ఎక్కువ అర్హుడని చెబుతూ ఆమె బహుమతిని తనకు అందించారని గుర్తుచేశారు. వివిధ దేశాలపై వాణిజ్య సుంకాలను అస్త్రంగా ఉపయోగించి, అనేక యుద్ధాలు జరగకుండా అడ్డుకోగలిగానని ట్రంప్ చెప్పుకొచ్చారు. అమెరికా- ఇరాన్ ఉద్రిక్తతలను కూడా త్వరలోనే పరిష్కరిస్తానని ధీమా వ్యక్తం చేశారు. తానెన్నో యుద్ధాలను ఆపానని, నోబెల్ శాంతి బహుమతికి తన కంటే అర్హులెవరూ లేరంటూ గతంలో కూడా చాలాసార్లు ట్రంప్? పేర్కొన్నారు. నోబెల్ కమిటీని ఉద్దేశిస్తూ, వారి నిర్ణయం ఏంటో తమకు తెలియదని, తనలాంటి వారికి ఈ పురస్కారం ఇవ్వకపోవడమే వారికి అలవాటుగా కనిపిస్తోందని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇంతకుముందు ఎవరూ చేయలేని పనులు నేను చేశా. నేను గొప్పలు చెప్పుకోవడం లేదు. కేవలం వాస్తవాలు మాత్రమే చెబుతున్నా. బహుశా ఏ అధ్యక్షుడు కూడా ఇన్ని యుద్ధాలను పరిష్కరించి ఉండకపోవచ్చు. కానీ నేను మాత్రం ఒకటి రెండు కాదు, ఏకంగా 8 యుద్ధాలు ఆపాను. కాబట్టి నోబెల్ శాంతి బహుమతి పొందేందుకు నేను అర్హుడిని. కానీ అది నాకు వస్తుందనే నమ్మకం మాత్రం తక్కువే. ఒకవేళ నాకు నోబెల్? ఇవ్వకపోతే అది కమిటీకి పెద్ద అవమానం అవుతుందని అన్నారు. ఇదిలా ఉండగా, ఈ ఏడాది నామినేషన్లలో ట్రంప్ పేరు ఉండొచ్చని గతంలోనే ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారం ఎవరిని వరిస్తుందన్న విషయంపై ఉత్కంఠ నెలకొంది. ఏది ఏమైనా అన్నివిధాల అర్హుడికే ఈ నోబెల్ శాంతి బహుమతి దక్కాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# పశ్చిమాసియాకు మరో అగ్నిపరీక్ష



ఇప్పటికే అనేక సంక్షోభాలతో అట్టుడుకుతున్న పశ్చిమాసియాకు మరో ప్రమాద ఘంటిక మోగుతోంది. అటు యెమెన్ పైనా, ఇటు సౌదీ అరేబియాపైనా హూతీలు దాడులను తీవ్రతరం చేయడంతో పశ్చిమాసియా పరిస్థితి పెనంమీదనుంచి పొయ్యిలోకి పడినట్లయింది. హూతీలను అణచివేయడానికి సౌదీ అరేబియా సైనిక చర్యలను ముమ్మరం చేస్తున్న వేళ.. ఆ దేశానికి అండగా నిలిచేందుకు పాకిస్థాన్, తుర్కియే సిద్ధమవుతున్నాయి. ఆగస్టులో కుదిరిన మక్కా సంయుక్త రక్షణ ఒప్పందం కింద మూడు దేశాలూ సామూహిక రక్షణ చర్యలను అమలు చేయాలని నిర్ణయించడం ఈ పరిణామంలో కీలక మలుపు. మక్కా ఒప్పందం ఉద్దేశం ఒక సభ్యదేశంపై దాడిని మిగిలిన సభ్యదేశాలపై దాడిగా పరిగణించి సమష్టిగా స్పందించడం. హూతీల తాజా దాడుల నేపథ్యంలో రియాద్‌లో అత్యవసరంగా సమావేశమైన మూడు దేశాల రక్షణ, విదేశాంగ ఉన్నతాధికారులు ఒప్పందాన్ని ఆచరణలోకి తీసుకురావాలని నిర్ణయించారు. అవసరమైన సైనిక సామర్థ్యాలను త్వరగా సౌదీకి తరలించేందుకు కూడా అంగీకారం కుదిరింది.

అయితే బలగాల సంఖ్య, వాటి కచ్చితమైన పాత్ర బహిర్గతం కాలేదు. పాకిస్థాన్ ఇప్పటికే సౌదీ రక్షణలో తన బలగాలను వినియోగిస్తుండగా, తుర్కియే విషయంలో పార్లమెంటరీ అనుమతులు వంటి అంశాలు ఇంకా కీలకంగా ఉన్నాయి. ఇప్పటివరకు సౌదీ -హూతీల ఘర్షణ ప్రధానంగా యెమెన్ అంతర్గత యుద్ధానికి పొడిగింపుగానే కనిపించింది. కానీ బాబ్ అల్-మందబ్ జలసంధిపై హూతీల పట్టు పెరగడం, ఎర్ర సముద్ర నౌకాయానానికి ముప్పు ఏర్పడటం, సౌదీ చమురు మౌలిక వసతులపై దాడుల భయం పెరగడంతో ఇది అంతర్జాతీయ భద్రతా సమస్యగా మారింది. ప్రపంచ వాణిజ్యానికి, చమురు రవాణాకు అత్యంత కీలకమైన ఈ మార్గంలో ప్రయాణం ప్రమాదకరంగా మారితే దాని ప్రభావం పశ్చిమాసియాను దాటి ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై పడుతుంది. సౌదీ అరేబియా ఇప్పటికే హూతీలపై భారీ ప్రతిదాడికి సన్నాహాలు చేస్తోంది. యెమెన్‌లోని ప్రభుత్వ అనుకూల బలగాలను ముందుండేలా చేసి, తమ వైమానిక దళాల మద్దతుతో భూతల దాడులు సాగించాలన్నది రియాద్ వ్యూహంగా కనిపిస్తున్నది. పాకిస్థాన్, తుర్కియే కూడా ఈ ప్రయత్నానికి రక్షణ, నిఘా, సాంకేతిక సహకారం అందించే దిశగా కదులుతున్నాయి. అయితే ఇవి ప్రత్యక్ష యుద్ధంలో ఎంతవరకు పాల్గొంటాయన్నదే అసలు ప్రశ్న. హూతీలకు ఇరాన్ మద్దతు ఉందన్న సంగతి బహిరంగ రహస్యమే. ఇప్పటికే ఇరాన్- అమెరికా సంబంధాలు ఉద్రిక్తంగా ఉన్న సమయంలో యెమెన్ మరో యుద్ధరంగంగా మారితే పశ్చిమాసియాలో పరిస్థితి బహుముఖ ఘర్షణకు దారితీయవచ్చు. సౌదీ లక్ష్యం హూతీల సామర్థ్యాన్ని పరిమితం చేయడమే అయినప్పటికీ, హూతీలు అందుకు ప్రతిగా సౌదీ చమురు క్షేత్రాలు, విమానాశ్రయాలు, నౌకాశ్రయాలు, నౌకాయాన మార్గాలను లక్ష్యంగా చేసుకునే ప్రమాదం ఉంది. ఈ సంక్షోభంలో అమెరికా వైఖరి అత్యంత ఆసక్తికరమైన అంశం. ట్రంప్ ప్రభుత్వం ఇప్పటివరకు సౌదీకి నిఘా, లక్ష్య నిర్ధారణ సమాచారం వంటి సహాయం అందిస్తున్నప్పటికీ, హూతీలపై నేరుగా వైమానిక దాడులకు దిగేందుకు వెనుకాడుతున్నది. సౌదీ కోరిన ప్రత్యక్ష సైనిక సహాయాన్ని ప్రస్తుతానికి తిరస్కరించినట్లు అమెరికా వర్గాలు తెలిపాయి. మరో యుద్ధంలో చిక్కుకోవడానికి అమెరికా ఎంతమాత్రం సిద్ధంగా లేదన్న విషయాన్ని ఈ పరిణామం చెప్పకనే చెబుతోంది. ఒకవైపు సౌదీ భద్రత, మరోవైపు ఇరాన్‌తో ఉద్రిక్తత, ఇంకోవైపు ఎర్ర సముద్రంలో నౌకాయాన భద్రత.. ఈ మూడింటి మధ్య వాషింగ్టన్ సమతూకం పాటించాల్సి ఉంటుంది. అయితే హూతీల దాడులు అంతర్జాతీయ వాణిజ్యానికి లేదా అమెరికా మిత్రదేశాల కీలక మౌలిక వసతులకు తీవ్రమైన ముప్పుగా మారితే అమెరికా ప్రత్యక్షంగా రంగంలోకి దిగే అవకాశాన్ని పూర్తిగా తోసిపుచ్చలేం.

మక్కా ఒప్పందం పత్రాలకే పరిమితమైన రక్షణ వ్యవస్థ కాదని తాజా పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. అయినా అది పూర్తిస్థాయి సైనిక కూటమిగా మారుతుందా అన్నది మూడు దేశాల రాజకీయ సంకల్పం, ముఖ్యంగా తుర్కియే పార్లమెంటు నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. ఇప్పటి అవసరం యుద్ధాన్ని విస్తరించడం కాదు.. దాన్ని అదుపులోకి తేవడం. హూతీల దాడులు, సౌదీ ప్రతిదాడులు, ఇరాన్ పాత్ర, మక్కా కూటమి సైనికీకరణ.. అన్నీ కలిసి ఒక ప్రాంతీయ యుద్ధానికి దారితీస్తే దాని మూల్యం పశ్చిమాసియాతో ఆగదు. చమురు ధరల నుంచి నౌకాయానం వరకు, ప్రపంచ వాణిజ్యం నుంచి భద్రత వరకు దాని ప్రకంపనలు అన్ని దేశాలకూ తాకుతాయి. అందువల్ల మక్కా ఒప్పందం సామూహిక యుద్ధానికి వేదికగా కాకుండా.. దౌత్యపరమైన పరిష్కారానికి దారి చూపే సాధనంగా మారాల్సిన అవసరం ఉంది.

# అమెరికా నిజంగానే దివాళా తీస్తుందా?

మొదటి నుంచీ ఎలాన్ మస్క్‌కి ఒక ప్రత్యేకత ఉంది. ఇతరులు భవిష్యత్తు గురించి ఆలోచిస్తున్నప్పుడు... తాను ఆ భవిష్యత్తును తయారు చేయాలని ప్రయత్నిస్తుంటారు. ఎలక్ట్రిక్ కార్ల నుండి అంతరిక్ష ప్రయోగం వరకు ఆయన చేసిన ప్రయోగాలు ఇందుకు ఉదాహరణ. ఇందుకే అమెరికా ఆర్థిక భవిష్యత్తుపై ఆయన చేసిన హెచ్చరికను కూడా మార్కెట్లు, బడ్జెట్ ప్రసంగం, పెట్టుబడిదారులు ఆసక్తిగా గమనిస్తున్నారు. "అమెరికా దివాళా తీసే అవకాశం ఉంది" అని చెప్పినప్పుడు అది సాధారణ కామెంట్‌గా మిగలలేదు. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక వర్గాల్లో చర్చ రగిల్చింది. మస్క్ చెప్పింది నిజంగా అమెరికా రేపో మాపో దివాళా తీస్తుందన్న హెచ్చరికా? లేక వేగంగా పెరుగుతున్న అప్పులు, వడ్డీ భారం, బడ్జెట్ లోటు గురించి ఆయన చెబుతున్న అసలు సమస్యను మనం వేరే కోణంలో చూడాలా? అమెరికా జాతీయ రుణం గురించి మాట్లాడినప్పుడు మస్క్ ఈ తీవ్రమైన హెచ్చరిక చేశాడు. ఏఐ, రోబోటిక్స్ సాంకేతికతలు గుసగుస లేకపోతే అమెరికా ఆర్థికంగా తీవ్ర చిక్కుల్లో పడుతుందని, అప్పుల ఊబి నుండి గట్టెక్కడానికి ఇవి తప్ప మరో మార్గం లేదని ఆయన స్పష్టం చేశారు. అయితే మస్క్ మాటల అంతరార్థం "అమెరికా దగ్గర రూపాయి (డాలర్) కూడా లేకుండా పోయింది" అని కాదు; పెరుగుతున్న అప్పుల భారం దేశ ఆర్థిక వ్యవస్థ లోతుల్లోకిపోతే అప్పుల సమస్య మొదలవుతుందనే ఆయన ఆందోళన. అమెరికా ఇప్పటికే అప్పులపై చెల్లిస్తున్న వడ్డీ ఖర్చు రికార్డు స్థాయికి చేరడమే ఈ భయానికి ప్రధాన కారణం. అమెరికా జాతీయ రుణం ఇప్పటికే 40 ట్రిలియన్ డాలర్ల మార్కును దాటింది. ప్రస్తుతం అమలులో ఉన్న ఆర్థిక విధానాలు దీర్ఘకాలంలో స్థిరంగా కొనసాగలేవని, రుణం-జీడీపీ నిష్పత్తి భవిష్యత్తులో మరింత ప్రమాదకరంగా మారుతుందని అమెరికా ట్రెజరీ స్వయంగా అంగీకరించడం పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకునేందుకే. అసలు సమస్య అప్పు చేయడం మాత్రమే కాదు, దానిపై చెల్లిస్తున్న వడ్డీ భారం కొండలా పెరిగిపోవడం. ప్రస్తుతం అమెరికా ప్రభుత్వం కేవలం అప్పులపై వడ్డీ చెల్లించడానికే ఏడాదికి సుమారు 1 ట్రిలియన్ డాలర్లు ఖర్చు చేస్తోంది. అంటే ప్రభుత్వం సేకరించే ప్రతి ఐదు డాలర్ల ఆదాయంలో



దాదాపు ఒక డాలర్ కేవలం వడ్డీలకే సరిపోతుంది. "ఇప్పుడేం చెప్పలేం కానీ ఉన్నంత కాలం బాగానే ఉన్నా, ఆదాయం కంటే వడ్డీలు ఎక్కువైనప్పుడు" అసలు కథ మొదలవుతుంది. అమెరికా విషయంలో సరిగ్గా ఇదే జరుగుతుందేమోనని ఆర్థిక నిపుణులు కూడా తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా అత్యంత ఆమోదయోగ్యమైన 'రిజర్వ్ కరెన్సీ' అయిన డాలర్‌ను ముద్రించే అధికారం అమెరికాకు ఉంది. కాబట్టి దేశం పూర్తిగా దివాళా తీసి, మూతపడిపోతుందనే కోణంలో మస్క్ వ్యాఖ్యలను చూడలేం. కానీ, పెరుగుతున్న అప్పుల వల్ల వడ్డీ భారం పెరిగి, దానికోసం మరింత అప్పు చేయాల్సి రావడం, దానివల్ల మార్కెట్‌లో వడ్డీ రేట్లు మరింత పెరిగిపోవడం లాంటి 'డెట్ స్పైరల్' ఏర్పడే ప్రమాదం ఖచ్చితంగా ఉంది. దిగ్గజ ఇన్వెస్టర్ జే డాలియో, జేపీ మోర్గాన్ సీఈఓ జేమీ డిమాన్ వంటి వారు కూడా ఇదే రకం విషయాల గురించి అమెరికాను హెచ్చరించడం గమనార్హం. అప్పుల సుడిగుండం నుండి బయటపడటానికి ఏ దేశానికైనా రెండే మార్గాలుంటాయి: ఒకటి ఖర్చులు తగ్గించుకోవడం, రెండు ఆర్థిక వ్యవస్థను వేగంగా పెంచడం. మస్క్ రెండవ మార్గాన్ని ఎంచుకున్నారు. రోబోటిక్స్, రంగాల వల్ల మానవ ఉత్పాదకత పదింతలు పెరిగితే, వస్తువులు, సేవల ఉత్పత్తి విపరీతంగా పెరుగుతుంది. తద్వారా ఆర్థిక వ్యవస్థ పరిమాణం పెరిగి, ప్రభుత్వానికి పన్నుల రూపంలో భారీ ఆదాయం వస్తుంది. ఫలితంగా అప్పు-జీడీపీ నిష్పత్తి తగ్గుతుందని మస్క్ భావిస్తున్నారు. ఆయన ఆలోచనలో రోబోటిక్స్ అనేది కేవలం ఒక యంత్రం కాదు, దేశ ఆర్థిక వ్యవస్థను పరుగులు తీర్పించే గ్రోత్ ఇంజిన్. అయితే, అంత త్వరగా అలాంటి ఉత్పాదకతను సాధించగలరా లేదా అన్నది కాలమే నిర్ణయించాలి. అమెరికాలో పెద్ద ఆర్థిక సంక్షోభం తలెత్తితే అది వారి సొంత సమస్య మాత్రమే కాదని, గ్లోబల్ ఎకానమీలో భాగంగా భారత్‌పై కూడా దాని ప్రభావం ఖచ్చితంగా ఉంటుందని మనం గ్రహించాలి. అమెరికా బాండ్ యీల్డ్స్ పెరిగితే విదేశీ పెట్టుబడిదారులు భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న మార్కెట్ల నుంచి తమ డబ్బును ఉపసంహరించుకుని అమెరికా అప్పుల్లో పెట్టుబడి పెడతారు. దీనివల్ల భారత స్టాక్ మార్కెట్లో హెచ్చుతగ్గులు రావడమే కాకుండా రూపాయి విలువ పడిపోయే ప్రమాదం ఉంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి బలహీనపడితే మన దిగుమతుల ఖర్చు భారీగా పెరుగుతుంది. ముఖ్యంగా భారత్ అత్యధికంగా దిగుమతి చేసుకునే క్రూడ్ ఆయిల్ ధరలు పెరిగి, దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలతో పాటు రవాణా ఖర్చులు ప్రియమవుతాయి. రవాణా ఖర్చులు పెరిగితే నిత్యవసరాలు, కూరగాయల ధరలు పెరిగి హైదరాబాద్‌లో ఉండే ఒక సాధారణ కుటుంబం నెలవారీ బడ్జెట్‌పై నేరుగా ప్రభావం పడుతుంది. భారతీయు ఐటీ రంగానికి ఇది రెండు రకాల పరిణామాలను తెచ్చిపెట్టవచ్చు. ఒకవైపు అమెరికా కంపెనీలు ఖర్చులు తగ్గించుకోవడానికి ప్రాజెక్టులను కుదిస్తే ఐటీ అవుట్‌సోర్సింగ్‌పై ఒత్తిడి పెరుగుతుంది. మరోవైపు, తమ ఖర్చులను వేగంగా తగ్గించుకోవడానికి వారు భారతీయ, మన ఐటీ కంపెనీలకు మరిన్ని అవకాశాలు తలుపు తట్టవచ్చు. మొత్తానికి, మస్క్ చెప్పినట్లుగా అమెరికా వెంటనే దివాళా తీయకపోవచ్చు కానీ, పెరుగుతున్న అప్పులు మరియు వడ్డీ భారం నిజంగానే ఆ దేశానికి పెద్ద తలనొప్పిగా మారాయి. మస్క్ హెచ్చరికలో కొంత అతిశయోక్తి ఉన్నప్పటికీ, అమెరికా అప్పుల సమస్యను ప్రపంచం ఏమాత్రం నిర్లక్ష్యం చేయలేదనేది పచ్చి నిజం. అందుకే ఇప్పుడు ఆలోచించాల్సింది "అమెరికా దివాళా తీస్తుందా, లేదా?" అని మాత్రమే కాదు, పెరుగుతున్న అప్పుల భారం కంటే వేగంగా, అమెరికా తన ఆర్థిక వ్యవస్థను పరుగులు తీర్చగలడా లేదా అనేదే దీనికి కాలమే సమాధానం చెప్పాలి.

# ముంబై లేబర్ క్యాంపులో భారీ అగ్నిప్రమాదం.

**న్యూఢిల్లీ,**

మహారాష్ట్ర, ముంబైలోని ఒక లేబర్ క్యాంపులో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ముంబై, ములంద్ ఈస్ట్, టాటా కాలనీలోని పీఏపీ ప్రాజెక్టు వద్ద గురువారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. సిలిండర్లు పేలడంతో అగ్నిప్రమాదం జరిగినట్లు ప్రాథమిక సమాచారం. ఈ ప్రదేశంలోని ఒక జీం1 బిల్డింగులో కొంతమంది లేబర్లు ఉంటున్నారు. వీరంతా ముంబై మురికివాడ అయిన ధారావి నుంచి వచ్చిన వారు.ధారావిలో ఆశ్రయం కోల్పోయిన వారికి ఈ బిల్డింగులో పునరావాసం కల్పిస్తున్నారు. దీంతో ఇక్కడ చాలా మంది లేబర్లు ఆశ్రయం పొందుతున్నారు.



షాపూర్జీ పల్లోంజి గ్రూప్ ఇక్కడ ఒక ప్రాజెక్టు నిర్మిస్తూ, ఆశ్రయం కల్పిస్తోంది. ఈ క్యాంపు బిల్డింగులో ఉన్నట్లుండి ఒక గ్యాస్ సిలిండర్ పేలింది. దీనివల్ల మరో ఆరింటితో కలిపి మొత్తం ఏడు గ్యాస్ సిలిండర్లు పేలాయి. ఈ ఘటనతో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనతో భయభ్రాంతులకు గురైన కార్మికులు కొందరు బయటకు పరుగెత్తారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. 15 ఫైర్ ఇంజిన్లు, అంబులెన్సులు, పోలీసులు సహాయక చర్యల్లో పాల్గొంటున్నాయి. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఇప్పటివరకు ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని, ప్రాణహాని జరగలేదని డీసీపీ అభయ్‌సిన్హా దేశ్‌ముఖ్ తెలిపారు. అగ్నిప్రమాదంపై మరింత సమాచారం రావాల్సి ఉంది.

# మైనారిటీ యువతకు నైపుణ్యాభివృద్ధి

**-నైపుణ్యభివృద్ధి కేంద్రాలుగా సిటిసిలు**
**-రూ.3.31కోట్లతో 36 కేంద్రాలకు 216 అధునాతన కంప్యూటర్లతో శిక్షణ**
**-మైనారిటీ యువత సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి**
**-మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్**



**అమరావతి, అక్టోబరు 08 (డ్రీమ్ టైమ్స్)**
రాష్ట్రం లో మైనారిటీ యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వం లోని కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు.గురువారం మంగళగిరి లోని ఉర్దూ అకాడమీ కార్యాలయం లో చైర్మన్ ఫారూక్ షుబ్లీ అధ్యక్షతన రూ.3.31 కోట్లతో 216 కంప్యూటర్లు, ప్రింటర్లు, యూపీఎస్ లు కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్ల(సిటీసిలు) కు పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిధి గా మంత్రి ఎన్ఎండి ఫరూక్ హాజరై మాట్లాడారు. రాష్ట్రం లోని ఉర్దూ కంప్యూటర్ శిక్షణా కేంద్రాలను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి చేసి, యువతకు మెరుగైన కంప్యూటర్ శిక్షణ, డిజిటల్ నైపుణ్యాలు, ఉపాధికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ప్రభుత్వం కార్యాచరణ కు శ్రీకారం చుట్టిందన్నారు. శిక్షణ కేంద్రాలకు కంప్యూటర్లు పంపిణీ లో ఉర్దూ అకాడమీ చైర్మన్ ఫారూక్ షుబ్లీ చేపట్టిన కార్యాచరణను మంత్రి అభినందించారు.కర్నూలు, నంద్యాల, మంగళగిరి, విశాఖపట్నం, గుంటూరు మరియు మదనపల్లె సిటీసి లను ప్రత్యేకంగా మోడల్ కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్లుగా అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలోని ఉర్దూ సిటిసిల ఆధునీకరణ, యువతకు నైపుణ్యాభివృద్ధి, డిజిటల్ విద్య,ఉపాధి అవకాశాల విస్తరణకు, ఉర్దూ భాష అభివృద్ధికి కూటమి ప్రభుత్వం విస్తృత చర్యలు చేపట్టిందని తెలిపారు. ప్రభుత్వ పథకాలను మైనారిటీ యువత అందిపుచ్చుకొని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి ఫరూక్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ , సభ్యుడు మహమ్మద్ అక్రమ్, వక్ఫ్ బోర్డు సీఈఓ అబ్దుల్ ఖాదర్, ఉర్దూ అకాడమీ డైరెక్టర్ నిజాముద్దీన్, దూదేకుల, నూర్భాష ఫెడరేషన్ డైరెక్టర్ గౌస్ పీర్ తదితరులు పాల్గొన్నారు.

## నవోదయలో ఘనంగా ముగిసిన క్లస్టర్ స్థాయి 'కళా ఉత్సవ్ పోటీలు



**ఎమ్మిగనూరు (డ్రీమ్ టైమ్స్)**
మండల పరిధిలోని జవహర్ నవోదయ విద్యాలయంలో నిర్వహించిన క్లస్టర్ స్థాయి 'ఆర్ట్ ఇన్ ఎడ్యుకేషన్' (కళా ఉత్సవ్) పోటీలు ఘనంగా ముగిశాయి. ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 21 జవహర్ నవోదయ విద్యాలయాల నుంచి విద్యార్థులు, ఎస్కార్ట్ ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రతిభను చాటారు. రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ కళా ఉత్సవ్‌లో వోకల్ సోలో, వోకల్ గ్రూప్, ఇన్‌స్ట్రుమెంటల్ సోలో, ఇన్‌స్ట్రుమెంటల్ గ్రూప్, 2D ఆర్ట్, 3D ఆర్ట్, స్టోరీ టెల్లింగ్, ఇండిజినస్ టాయ్స్ (సాంప్రదాయ బొమ్మల తయారీ) తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించారు. విద్యార్థులు తమ సృజనాత్మకత, కళా నైపుణ్యం, ప్రతిభను అద్భుతంగా ప్రదర్శించారు. కలలు మన జీవితానికి దిశానిర్దేశం చేస్తాయని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమలో ప్రిన్సిపాల్ పద్మావతి, ఎస్ఎంస్మల్ డిగ్రీ కళాశాల లెక్చరర్ డా. పాల్ దేవానందం, విద్యాలయం తెలుగు అధ్యాపకులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ పోటీలకు కర్నూలు ప్రభుత్వ సంగీత కళాశాలకు చెందిన సంగీత విద్వాంసులు, వివిధ రంగాల కళా నిపుణులు మరియు ఉపాధ్యాయులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. శ్రీకిరణ్, సాయికిరణ్ (మ్యూజిక్ టీచర్), లక్ష్మీనారాయణ, హరీష్ కుమార్, ఆర్ట్ టీచర్ ముని సుబ్బయ్య, శిరీష, శశికిరణ్, శ్రీనివాసరావు, వెంకటయ్య, మీనా చంద్రన్, లోకనాథ్, ప్రభాకర్, వెంకటేష్, శ్రీకిరణ్, సాయి శ్రీకర్ తదితరులు ఉన్నారు.

## మహానందిలో 11 నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

**-మహానంది క్షేత్రంలో ఉత్సవాల కరపత్రాలు విడుదల**



**నంద్యాల ప్రతినిధి, అక్టోబరు 08 (డ్రీమ్ టైమ్స్):**
దసరా వేడుకలను పురస్కరించుకుని మహానందీశ్వర స్వామి క్షేత్రంలో ఈనెల 11 నుంచి 20వ తేదీ వరకు దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు దేవస్థానం చైర్మన్ నరాల చంద్రమౌళీశ్వర రెడ్డి తెలిపారు. వేడుకల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు కల్పిస్తామని చెప్పారు. మహానందిశ్వర స్వామి దేవస్థానంలో ఉత్సవాల నిర్వహణపై పాలకమండలి సభ్యులు, అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. అనంతరం మహానందిశ్వర స్వామి, కామేశ్వరి దేవి అమ్మవార్లకు వేద పండితులు, ప్రధాన అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అలంకార మండపంలో నవరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రికలను చైర్మన్ నరాల చంద్ర మౌళీశ్వర రెడ్డి, ఈవో శ్రీనివాసరెడ్డిలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శత చండియాగ పూర్వక నవ దుర్గాలంకార, శ్రీచక్రార్చన, సహస్ర దీపాలంకార పూజలతో శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆలయంలో కొలువైన మూలవిరాట్ ఉత్సవ విగ్రహానికి ఉదయం, సాయంత్రం ప్రత్యేక అలంకరణ చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో మధు, పర్యవేక్షకులు శశిధర్ రెడ్డి, ధర్మకర్త మండలి సభ్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## చౌరబాటుదారుల కోసమే.. కాంగ్రెస్ 'ఓటు చోరీ' నాటకం!

**-నకిలీ ఓట్లతో గెలిచేందుకే ఈ కుట్రలు**
**- కాంగ్రెస్ తీరుపై మండిపడ్డ జిల్లా బీజేపీ నేత అభిరుచి మధు**



**నంద్యాల ప్రతినిధి, అక్టోబరు 08 (డ్రీమ్ టైమ్స్)**
ఓటు బ్యాంకు ప్రయోజనాల కోసమే దేశంలో అక్రమంగా ఉంటున్న చొరబాటుదారులను కాపాడుతూ 'ఓటు చోరీ' నాటకానికి కాంగ్రెస్ పార్టీ తెరతీసిందని బీజేపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు ధ్వజమెత్తారు. స్వార్థ రాజకీయాల కోసం చొరబాటుదారులకు కొమ్ముకాస్తూ అక్రమార్కుల ఓట్లతో గెలవడానికే రాజ్యాంగబద్ధమైన ఎన్నికల వ్యవస్థలపై ఆ పార్టీ నిందలు మోపుతోందని ఆయన విమర్శించారు. గురువారం ఆయన ఈ మేరకు ఒక పత్రికా ప్రకటన విడుదల చేస్తూ కాంగ్రెస్ నేతల తీరుపై మండిపడ్డారు. నకిలీ ఓట్లు, అక్రమ వలసదారుల కోసం 2004 నుంచి 2014 వరకు కనీసం ఒక్కసారి కూడా దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఓటర్ల జాబితా ప్రక్షాళన (సర్ ) నిర్వహించలేదని ఆరోపించారు. దశాబ్దాల పాటు ఓటర్ల జాబితాను పట్టించుకోకపోవడం వల్లనే దేశవ్యాప్తంగా కోట్లాది నకిలీ నమోదులు, మరణించిన వారి పేర్లు జాబితాలో పేరుకుపోయాయని అభిరుచి మధు పేర్కొన్నారు. నేడు మళ్లీ అక్రమంగా దేశంలోకి వచ్చిన రోహింగ్యాలు, బంగ్లాదేశీయులకు అండగా నిలిచేందుకే రాహుల్ గాంధీ ఈ ఓటు చోరీ నాటకాన్ని తెరపైకి తీసుకొచ్చారని ఆయన తీవ్ర విమర్శలు చేశారు. ?స్వతంత్ర సంస్థలైన ఎన్నికల సంఘాన్ని, ప్రజాస్వామ్య వ్యవస్థలను బద్నాం చేసి, అక్రమార్కుల ఓట్లతో ఎలాగైనా గెలవాలన్నదే కాంగ్రెస్ అసలు ప్లాన్ అని ఆయన ఆరోపించారు. దొంగ ఓట్లను పోగేసి గద్దెనెక్కాలని చూస్తున్న కాంగ్రెస్ కుట్రలను దేశ ప్రజలు గమనిస్తున్నారని, సరైన సమయంలో ఆ పార్టీకి తగిన బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు.

## జీరో పావర్టీ మిషన్ సర్వేపై వివోఏలు, వివో ఓబీలకు అవగాహన సదస్సు



**తనకల్లు అక్టోబర్ 8 డ్రీమ్ టైమ్స్ న్యూస్**
తనకల్లు మండల చౌడేశ్వరి మండల సమాఖ్య కార్యాలయంలో అధ్యక్షురాలు హనీఫా ఆధ్వర్యంలో జీరో పావర్టీ మిషన్ కార్యక్రమంలో భాగంగా నిరుపేద కుటుంబాల సర్వే ప్రక్రియపై వివో ఓబీలు, వివోఏలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి రామా నాయక్, జిల్లా ప్రాజెక్టు యాజమాన్య యూనిట్ నుండి హనుమేష్, రైతు ఉత్పత్తిదారుల సంస్థ సహాయ ప్రాజెక్టు మేనేజర్ రమణప్ప, సహాయ ప్రాజెక్టు మేనేజర్ హేమలత, మండల సమాఖ్య అధ్యక్షురాలు హనీఫా బీ, ఉమాదేవి, సమాజ సమన్వయకర్తలు ప్రవీణ్, నాగార్జున, భాస్కర్, జహారబీ, మండల సమాఖ్య సహాయకులు, గ్రామైక్య సంఘాల బాధ్యులు మరియు నివాస ప్రాంత ప్రతినిధులు పాల్గొన్నారు.

## శ్రీరామ హృదయ కలశం ఊరేగింపు

**- కోటేకల్‌లో ఘనంగా శ్రీరామ హృదయ కలశం ఊరేగింపు**




**ఎమ్మిగనూరు (డ్రీమ్ టైమ్స్)**
ఆచార్య శ్రీ శ్రీ శ్రీ చిన్న రామానుజ జీయర్ స్వామి వారి సప్తతి తిరునక్షత్రం సందర్భంగా కోటేకల్ గ్రామంలో శ్రీరామ హృదయ కలశంను గ్రామ వీధుల్లో భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు శ్రీరాముని తమ హృదయాల్లో స్మరించుకుంటూ కలశాన్ని తాకి, శ్రీరాముని తమ హృదయాల్లో నింపుకునే ఆధ్యాత్మిక భావనతో కార్యక్రమంలో పాల్గొన్నారు. ఊరేగింపు సందర్భంగా భక్తులు భజనలు, నామస్మరణలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు. ఆచార్యుల ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, శాంతి, ఆరోగ్యం నెలకొనాలని భక్తులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామంలో ఆధ్యాత్మికతతో పాటు ఐక్యత, భక్తి, సోదరభావం మరింత పెంపొందాయని గ్రామ పెద్దలు పేర్కొన్నారు.శ్రీ వైష్ణవ నరసింహమూర్తి స్వామి వారి ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు, యువకులు, భజన బృందం సభ్యులు, భక్తులు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. కార్యక్రమం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## సొంత నిధులతో కామినేని పల్లె, గోవింద పల్లె రోడ్డు మధ్య గుంతల మరమ్మత్తులు.







**శిరివెళ్ళ. (డ్రీమ్ టైమ్స్)**
మండల పరిధిలోని కామినేని పల్లె, గోవింద పల్లె మధ్య సుమారు 5 కిలోమీటర్ల రోడ్డు గుంతల మరమ్మత్తులు సొంత నిధులతో తారు రోడ్డుకు మర మత్తులు చేపట్టినట్లు మాజీ సర్పంచ్ మేర్వ చిన్న నరసింహారెడ్డి పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో తారు రోడ్డు వేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం గుంతలు పడడం వాహన దారులకు చాలా ఇబ్బందులు పడుతున్నారని మాజీసర్పంచి దృష్టికి ప్రజలు కోరడంతో ఆయన స్పందించి తక్షణమే సొంత నిధులతో రోడ్డు గుంతల పరమత్తులు చేపట్టడం జరిగిందన్నారు. రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడంతో వాహనదారులు సులువుగా ప్రయాణం చేయడం వల్ల ప్రజలు ,వాహనాదారులు, సంతోషం వ్యక్తం చేశారు.

## పశుగ్రాస పెంపకానికి దరఖాస్తుల ఆహ్వానం



**తనకల్లు అక్టోబర్ 8 డ్రీమ్ టైమ్స్ న్యూస్**
తనకల్లు మండలంలోని అన్ని గ్రామాలలో ఉన్న పాడి రైతులకు విబి-గ్రామ్ జి పథకం ద్వారా పశుగ్రాస పెంపకం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె రామ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పాడి పశువులు కలిగిన రైతులకు 5 పశువులకు పైబడి ఉంటే ఒక ఎకరా వరకు, 3 నుంచి 5 పశువులు కలిగి ఉంటే 0.50 సెంట్లు వరకు, 2 పశువులు కలిగి ఉంటే 0.25 సెంట్లు వరకు వ్యక్తిగత భూములలో పశుగ్రాస పెంపకమునకు ఒక ఎకరమునకు 69,781 రూపాయలను విబి-గ్రామ్ జి పథకం ద్వారా లబ్ధి చేకూరుస్తామని చెప్పారు. అయితే పాడి రైతులు ఇంతకుముందు విబి-గ్రామ్ జి ద్వారా లబ్ధి పొందకుండా ఉండాలని సూచించారు. అదేవిధంగా సొంతంగా ఇప్పటికే పశుగ్రాసం చేపట్టిన రైతులు అర్హులు కారని స్పష్టం చేశారు. కావున అర్హులైన రైతులు మండల వెటర్నరీ డాక్టర్ రవి నాయక్ కు 3 రోజుల లోపల దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు ఫారంతో పాటు జాబ్ కార్డు, చిన్న సన్నకారు రైతు సర్టిఫికేట్, పట్టాదారు పాసు పుస్తకం, 1బి, ఆధార్ కార్డ్, బ్యాంకు అకౌంట్, పాస్ కార్డ్ జతపరచాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె రామ నాయక్, వెటర్నరీ డాక్టర్ రవి నాయక్, విబి-గ్రామ్ జి పథకం అదనపు కార్యక్రమాధికారి వై మరియమ్మ సంయుక్తంగా తెలిపారు.

## గుంతకల్లు డిఎస్పీ బాలినేని శ్రీనివాసరావును కలసిన డాక్టర్ పత్తి హిమబిందు

**గుంతకల్లు, అక్టోబరు 8(డ్రీమ్ టైమ్స్):**
ఇటీవలే నూతనంగా బాధ్యతలు చేపట్టిన గుంతకల్లు డిస్పీ బాలినేని శ్రీనివాసరావును టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ పత్తి హిమబిందు గురువారం ఆయన చాంబర్ లో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమెతోపాటు శ్రీ కోదండ రామస్వామి దేవాలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్, టీడీపీ సీనియర్ నాయకులు దబ్బర నారాయణ, నారా లోకేష్ అభిమాన సంఘం జాతీయ అధ్యక్షులు ఆనంద రెడ్డి, వైశ్య ప్రముఖులు జయంతి వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.



# కూటమి ప్రభుత్వం యువత భవిష్యత్తుతో ఆడుకుంటోంది..

**- వైసీపీ అధికార ప్రతినిధి శ్యామల**

**-గంజాయి నిర్మూలన హామీ ఏమైందని ప్రభుత్వాన్ని నిలదీసిన శ్యామల**

**-టీవీ షోలపై కాకుండా గంజాయిపై దృష్టి పెట్టాలని హోంమంత్రికి హితవు**

**-రాష్ట్రంలో మాదకద్రవ్యాలు విచ్చలవిడిగా దొరుకుతున్నాయని ఆరోపణ**



**తాడేపల్లి, అమరావతి, (డ్రీమ్ టైమ్స్)**
కూటమి ప్రభుత్వం యువత భవిష్యత్తుతో చెలగాటం ఆడుతోందని, రాష్ట్రంలో మాదకద్రవ్యాలను నియంత్రించడంలో పూర్తిగా విఫలమైందని వైసీపీ అధికార ప్రతినిధి శ్యామల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

**వైసీపీ కేంద్ర కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ**

ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.ఎన్నికల సమయంలో గంజాయిని సమూలంగా నిర్మూలిస్తామన్న ముఖ్యమంత్రి చంద్రబాబు, నారా లోకేశ్ ఇప్పుడు ఏం సమాధానం చెబుతారని శ్యామల అన్నారు. "హోంమంత్రి వంగలపూడి అనితకు టీవీ షోల టీఆర్పీలపై ఉన్న శ్రద్ధ గంజాయి కేసులను అరికట్టడంపై లేదు. అధికారం లోకి వచ్చిన మూడు నెలల్లో గంజాయి లేకుండా చేస్తానన్న ఆమె సవాల్ ఏమైంది?" అని ఎద్దేవా చేశారు. కూటమి నేతలు ఆడుతున్నది యువత భవిష్యత్తును నాశనం చేసే 'టాక్సిక్ గేమ్' అని ఆమె ఆరోపించారు.

**మాదకద్రవ్యాల విక్రయాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి**

రాష్ట్రంలో గంజాయి, లిక్విడ్ గంజాయి, ఎండీఎంఏ వంటి మాదకద్రవ్యాల విక్రయాలు విచ్చలవిడిగా సాగుతున్నాయని శ్యామల అన్నారు. ఇటీవల అనకాపల్లిలో రూ.3 కోట్ల విలువైన గంజాయి, అల్లూరి జిల్లాలో రూ.1.34 కోట్ల విలువైన లిక్విడ్ గంజాయి పట్టుబడటమే ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రకాశం జిల్లాలో పోలీసుల కారులోనే గంజాయి దొరకడం సిగ్గుచేటని విమర్శించారు.

**6 లక్షల కిలోలకు పైగా గంజాయిని పట్టుకున్నారు...**

ఈగల్' వెబ్‌సైట్ లెక్కల ప్రకారం రాష్ట్రంలో వేల కేసులు నమోదు చేసి, 6 లక్షల కిలోలకు పైగా గంజాయిని పట్టుకున్నారని... అలాంటప్పుడు గంజాయే లేదని ఎలా ప్రచారం చేస్తున్నారని ప్రభుత్వాన్ని ఆమె నిలదీశారు. ఆపరేషన్ చైతన్య, గరుడ వంటి కార్యక్రమాలు విఫలం అయ్యాయని, ప్రభుత్వం మాటలు చెప్పడం మాని చేతల్లో చూపించాలని హితవు పలికారు

# స్థానిక ఎన్నికల్లో వైసీపీని అడ్డుకునేందుకు కుట్ర జరుగుతోంది.

**-.మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆరోపణ**

**-వైసీపీ అభ్యర్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా అధికారులపై ఒత్తిడి చేస్తున్నారన్న అంబటి**

**-సీఎం, మంత్రి లోకేశ్ ఆదేశాలతోనే ఇదంతా జరుగుతోందని ఆరోపణ**

**-నామినేషన్లు తిరస్కరిస్తే ప్రజా ఉద్యమం తప్పదని హెచ్చరిక**



**అమరావతి, ఏపీ బ్యూరో, (డ్రీమ్ టైమ్స్)**
స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులను నామినేషన్ దశలోనే అడ్డుకునేందుకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆ పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు తీవ్ర ఆరోపణలు చేశారు. రిజర్వేషన్ స్థానాల్లో పోటీ చేసే తమ పార్టీ అభ్యర్థులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను అధికారులు ఉద్దేశపూర్వకంగా జారీ చేయడం లేదని ఆయన విమర్శించారు.

నామినేషన్లు తిరస్కరణకు గురైతే ప్రజా ఉద్యమం చేపడతామన్న అంబటి

ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఆదేశాలతోనే అధికారులు ఇలా వ్యవహరిస్తున్నారని అంబటి ఆరోపించారు. తహసీల్దార్లకు ఫోన్ చేసి ధ్రువపత్రాలు ఇవ్వొద్దని చెప్పే స్థాయికి చంద్రబాబు, లోకేశ్ దిగజారారని ఆయన వ్యాఖ్యానించారు. ఈ విషయంపై గుంటూరు జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశామని, వెంటనే సర్టిఫికెట్లు జారీ చేసేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారని తెలిపారు. సర్టిఫికెట్లు అందకపోవడం వల్ల నామినేషన్లు తిరస్కరణకు గురైతే ప్రజా ఉద్యమం చేపడతామని అంబటి హెచ్చరించారు.

నిర్మాణంలో ఉన్న భవనాన్ని కూల్చివేసింది

ఇదే సమయంలో, తాడేపల్లిలోని వైసీపీ కార్యాలయం అంశాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. గతంలో తమ ప్రభుత్వం పార్టీ కార్యాలయం కోసం రెండెకరాల భూమిని కేటాయించిందని, అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిర్మాణంలో ఉన్న భవనాన్ని కూల్చివేసిందని గుర్తుచేశారు. ఇప్పుడు ఆ స్థలాన్ని శ్మశానవాటిక కోసం స్వాధీనం చేసుకుంటున్నట్లు తహసీల్దార్ నోటీసులు ఇచ్చారని తెలిపారు. చంద్రబాబు నివాసానికి అనుమతులు లేవని ఆరోపణలు ఉన్నా, ఆయన కోర్టును ఆశ్రయించి కూల్చివేతను అడ్డుకున్నారని విమర్శించారు. ఈ అంశంపైనా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.
ప్రజల్లో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉందని, నిజాయతీగా ఎన్నికలు జరిగితే కూటమి ఘోరంగా ఓడిపోవడం ఖాయమని అంబటి రాంబాబు జోస్యం చెప్పారు. ప్రభుత్వ చర్యలతో ప్రజలు తిరుగుబాటుకు సిద్ధంగా ఉన్నారని ఆయన అన్నారు

# ఎమ్మెల్యే గౌరు హయాంలోనే అభివృద్ధి

**జిందాల్ యాజమాన్యం చొరవతో రెండు గ్రామాల్లో బోర్లు**



**నంద్యాల బ్యూరో (డ్రీమ్ టైమ్స్)**
టీడీపీ ప్రభుత్వం, ఎమ్మెల్యే గౌరు చరితమ్మ హయాంలో గ్రామాల్లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని మండల టీడీపీ అధ్యక్షుడు పంట దిలీప్‌కుమార్‌రెడ్డి అన్నారు. గడివేముల మండలంలోని బుజనూరు, గ్రంధివేముల గ్రామాల్లో తాగునీటి సమస్యను ఎమ్మెల్యే గౌరు చరితమ్మ, గౌరు వెంకటరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, జిందాల్ యాజమాన్యంతో మాట్లాడి గురువారం రెండు బోర్లు వేయించినట్లు తెలిపారు. కొత్తగా వేసిన బోర్లలో సుమారు 2.5 నుంచి 4 అంగుళాల మేర నీరు లభించిందని దిలీప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు సహకరించిన జిందాల్ యాజమాన్యానికి బుజనూరు, గ్రంధివేముల గ్రామాల ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ ప్రభుత్వం, ఎమ్మెల్యే గౌరు చరితమ్మ హయాంలో గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలు, వీధిదీపాలు, దేవాలయాలు, తాగునీటి సౌకర్యాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నారని అన్నారు. భవిష్యత్తులో కూడా గ్రామాలను సమస్యలు లేని ప్రాంతాలుగా తీర్చిదిద్దడమే ఎమ్మెల్యే లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో జేఎస్‌డబ్ల్యూ సీఎస్ఆర్ ప్రతినిధులు, జేఎస్‌డబ్ల్యూ భాస్కర్, బుజనూరు టీడీపీ సీనియర్ నాయకుడు పంట రామచంద్రారెడ్డి, గ్రంధివేముల టీడీపీ సీనియర్ నాయకుడు ఎస్వీ రామమోహన్‌రెడ్డి, రెండు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# 28 మద్యం దుకాణాలకు డ్రా ఆఫ్ లాట్స్



**ఒంగోలు..ప్రకాశం బ్యూరో, (డ్రీమ్ టైమ్స్)**
ప్రకాశం జిల్లా పరిధిలో నోటిఫై చేసిన మద్యం దుకాణాలకు డ్రా ఆఫ్ లాట్స్ ప్రక్రియ గురువారం నిర్వహించారు. మొత్తం 45 మద్యం దుకాణాలకు నోటిఫికేషన్ జారీ చేయగా, అర్హత సాధించిన 28 మద్యం దుకాణాలకు ఉదయం 8 గంటలకు డ్రా ఆఫ్ లాట్స్ నిర్వహించారు.జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు ఒంగోలు కలెక్టర్ కార్యాలయం లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా రెవెన్యూ అధికారి ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ జరిగింది. డ్రా ఆఫ్ లాట్స్ ద్వారా 28 మంది దరఖాస్తుదారులు మద్యం దుకాణాలను దక్కించుకున్నారు.ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కె. హేమంత్ నాగరాజు, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఎస్.కె. ఆయేషా బేగం తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలు పగడ్బందీగా నిర్వహించేందుకు ప్రత్యేక దృష్టి సారించాం..

**-జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు**



**ఒంగోలు,ప్రకాశం బ్యూరో,(డ్రీమ్ టైమ్స్)**
స్థానిక సంస్థల ఎన్నికలు పగడ్బందీగా నిర్వహించేందుకు ప్రత్యేక దృష్టి సారించామని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు చెప్పారు. ఈ దిశగా జిల్లాల యంత్రాంగం సన్నద్ధతపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా గురువారం అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రకాశం భవనం నుంచి కలెక్టర్ తో పాటు ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు, జెడ్పీ సీఈవో చిరంజీవి, డిపిఓ అనుపమ, అన్ని మున్సిపాలిటీల కమిషనర్లు పాల్గొన్నారు.

**కలెక్టర్ మాట్లాడుతూ...**

స్థానిక ఎన్నికల నిర్వహణకు అవసరమైన చర్యలు ముమ్మరం చేసామన్నారు. ఎన్నికల కమిషన్ నుంచి సామాగ్రి వచ్చిందని, జిల్లాస్థాయిలో అవసరమైన సామగ్రిని సమకూర్చుకునేందుకు టెండర్లను పిలిచామని చెప్పారు. ఎన్నికల విధులపై సిబ్బందికి అవగాహన కల్పించేలా మాక్ పోలింగ్ కూడా నిర్వహిస్తామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కు వివరించారు.

# ఢిల్లీలో కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో చంద్రబాబు భేటీ..

**- పోలవరం, జలధారపై కీలక చర్చ**

**-ఢిల్లీ పర్యటనలో బిజీగా గడుపుతున్న చంద్రబాబు**

**-కీలక ప్రాజెక్టుల పురోగతిని సీఆర్ పాటిల్‌కు వివరించిన చంద్రబాబు**

**-అమరజీవి జలధారకు నిధులు ఇవ్వాలని విన్నపం**



**అమరావతి,(డ్రీమ్ టైమ్స్)**
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తన ఢిల్లీ పర్యటనలో భాగంగా కాసేపటి క్రితం కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో సమావేశమయ్యారు. రాష్ట్రం లోని కీలక జల ప్రాజెక్టుల పురోగతిని, నిధుల అవసరాన్ని ఈ సందర్భంగా ఆయనకు వివరించారు. ముఖ్యంగా పోలవరం, జల్ జీవన్ మిషన్‌కు సంబంధించిన అంశాలపై ఈ భేటీలో ప్రధానంగా చర్చించారు.

**ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు నిధులను సకాలంలో విడుదల చేయాలి**

రాష్ట్రంలో రూ.30,000 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన 'జల్ జీవన్ మిషన్ – అమరజీవి జలధార' పథకం వివరాలను చంద్రబాబు కేంద్ర మంత్రికి తెలిపారు. రాష్ట్రంలోని 95 లక్షల గ్రామీణ కుటుంబాలకు గాను ఇప్పటికే 62 లక్షల ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఉన్నాయని, ఈ కొత్త పథకం ద్వారా మరో 27 లక్షల కుటుంబాలకు నీటి కనెక్షన్లు అందించడమే లక్ష్యమని వివరించారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు నిధులను సకాలంలో విడుదల చేయాలని కోరారు.

**పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేయాలి**

అనంతరం పోలవరం ప్రాజెక్టు పురోగతిపై కూడా ఇరువురు నేతలు సమీక్షించారు. వచ్చే గోదావరి పుష్కరాల నాటికి ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేయాలనే లక్ష్యంతో పనులు వేగంగా సాగుతున్నాయని చంద్రబాబు తెలిపారు. ప్రాజెక్టుకు నిధుల కొరత లేకుండా కేంద్రం పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. వీటితో పాటు, దక్షిణాది రాష్ట్రాల్లోని ఐదు నదుల అనుసంధానం అంశంపై కూడా చర్చించినట్లు సమాచారం. రెండు రోజుల పర్యటన నిమిత్తం చంద్రబాబు ప్రస్తుతం ఢిల్లీలో ఉన్నారు

# ఈనెల 16న విశాఖలో వైసీపీ 'ఉత్తరాంధ్ర 'బీసీ' గర్జన'

**-బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వ విధానాలను ఎండగట్టడమే లక్ష్యమన్న వైసీపీ**

**-బీసీలను చంద్రబాబు మోసం చేస్తున్నారని ఆరోపణ**

**-ఈ అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళతామని వెల్లడి**



**అమరావతి,(డ్రీమ్ టైమ్స్)**
ఉత్తరాంధ్రలోని బీసీ వర్గాల గొంతుకను బలంగా వినిపించేందుకు వైసీపీ సిద్ధమైంది. ఇందులో భాగంగా ఈ నెల 16వ తేదీన విశాఖపట్నంలో 'ఉత్తరాంధ్ర బీసీ గర్జన' పేరుతో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఈ సభకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పార్టీకి చెందిన బీసీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున హాజరుకానున్నారని తెలిపింది.
ప్రభుత్వ విధానాలను ఎండగట్టడమే లక్ష్యంగా..
ప్రధానంగా రెండు కీలక అంశాలపై ప్రభుత్వ విధానాలను ఎండగట్టడమే లక్ష్యంగా ఈ సభను నిర్వహిస్తున్నట్లు వైసీపీ వర్గాలు తెలిపాయి. రిజర్వేషన్ల విషయంలో చంద్రబాబు ప్రభుత్వం బీసీలను మోసం చేస్తోందని ఆరోపిస్తూ, ఈ అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళతామని వెల్లడించాయి. అదే సమయంలో రాష్ట్రంలో తమ పార్టీకి చెందిన బీసీ నేతలు, కార్యకర్తలపై జరుగుతున్న భౌతిక దాడులను, అన్యాయాలను ఈ వేదిక నుంచి తీవ్రంగా ఖండించాలని నిర్ణయించినట్టు తెలిపాయి

# బిజినెస్

## స్టాక్ మార్కెట్లలో భారీ పతనం

-ప్రారంభంలోనే అమ్మకాల ఒత్తిడితో కుదేలైన సూచీలు
-వెయ్యి పాయింట్లకు పైగా పడిపోయిన సెన్సెక్స్
-22,500 స్థాయికి చేరువలో నిఫ్టీ 50
-బజాజ్ ఫైనాన్స్ షేర్లలో భారీ అమ్మకాలు
-బజాజ్ ఫిన్‌సర్వ్, అదానీ పోర్ట్స్‌పైనా ఒత్తిడి
-వడ్డీ రేట్ల పెంపుపై ఇన్వెస్టర్ల ఆందోళన
-పెరుగుతున్న ముడి చమురు ధరల ప్రభావం
-ద్రవ్యోల్బణ భయాలతో బలహీనమైన మార్కెట్ సెంటిమెంట్



దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం భారీ నష్టాలతో ట్రేడింగ్‌ను ప్రారంభించాయి. ప్రారంభం నుంచే అమ్మకాల ఒత్తిడి పెరగడంతో సెన్సెక్స్ వెయ్యి పాయింట్లకు పైగా నష్టపోయింది. నిఫ్టీ 50 సూచీ కూడా 22,500 స్థాయికి చేరువైంది. ముఖ్యంగా బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, అదానీ పోర్ట్స్ షేర్లలో విక్రయాలు సూచీలపై ఒత్తిడి పెంచాయి. మరోవైపు వడ్డీ రేట్ల పెంపుపై ఆందోళనలు, అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు పెరగడం, ద్రవ్యోల్బణం విషయంలో నెలకొన్న భయాలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. దీంతో కీలక సూచీలు వరుసగా నష్టాలను చవిచూశాయి.

## భారీగా పెరిగిన బియ్యం ధరలు

-ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా ధరల పెరుగుదల
-నాలుగు నెలల్లో కిలో రూ.55 నుంచి రూ.85కు చేరిన ధర
-పండుగ సీజన్‌లో మరింత పెరిగే అవకాశం
-కొన్ని రకాల బియ్యం రూ.100 దాటొచ్చని అంచనా
-తగ్గిన దిగుబడితో మార్కెట్‌లో సరఫరా కొరత
-ధాన్యం నిల్వలు తగ్గడంతో పెరిగిన డిమాండ్
-ఎరువులు, కూలీల ఖర్చులు పెరగడం మరో కారణం
-రవాణా ఛార్జీల భారం కూడా ధరలపై ప్రభావం

దేశవ్యాప్తంగా బియ్యం ధరలు భారీగా పెరుగుతున్నాయి. ఎల్‌నినో ప్రభావంతో పంట దిగుబడి తగ్గడంతో మార్కెట్‌లో ధాన్యం లభ్యత తగ్గింది. దీంతో గత నాలుగు నెలల్లో సాధారణ సన్న బియ్యం ధర కిలో రూ.55 నుంచి రూ.85కు చేరింది.



పండుగ సీజన్ సమీపిస్తున్న నేపథ్యంలో ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని మిల్లు యజమానులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా తమిళనాడు వంటి రాష్ట్రాల్లో కొన్ని రకాల బియ్యం ధర కిలో రూ.100 దాటే అవకాశం ఉందని చెబుతున్నారు. దిగుబడి తగ్గడంతో పాటు ధాన్యం నిల్వలు తగ్గడం, ఎరువులు, కూలీలు, రవాణా ఖర్చులు పెరగడం కూడా ధరల పెరుగుదలకు కారణమవుతున్నాయి.

## బంగారం ధరల్లో స్వల్ప మార్పు

-హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,49,562
-22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,36,998
-అంతర్జాతీయ మార్కెట్‌లో 2 నెలల కనిష్ఠం నుంచి స్వల్పంగా కోలుకున్న పసిడి
-బలమైన డాలర్, అమెరికా వడ్డీరేట్ల అంచనాలతో ధరల్లో ఒడిదుడుకులు
-హైదరాబాద్‌లో కిలో వెండి రూ.2,21,712
-వెండి ధరలోనూ తగ్గుదల నమోదు



**హైదరాబాద్, అక్టోబర్ 8:**
బంగారం ధరల్లో గురువారం స్వల్ప మార్పు కనిపించింది. హైదరాబాద్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,49,561.53గా నమోదైంది. ఇది గతరోజుతో పోలిస్తే రూ.66.14 పెరిగింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ.1,36,998.36గా ఉంది. ఈ ధరలు సూచికాత్మకమైనవి కాగా, జీఎస్టీ, మేకింగ్ ఛార్జీలు తదితరాలు అదనంగా ఉంటాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో పసిడి ధరలు ఇటీవల రెండు నెలల కనిష్ఠానికి పడిపోయిన తర్వాత గురువారం స్వల్పంగా పుంజుకున్నాయి. స్పాట్ గోల్డ్ ఔన్స్‌కు 0.3 శాతం పెరిగి 4,122.12 డాలర్లకు చేరింది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్లపై అనుసరిస్తున్న వైఖరి, డాలర్ బలం, అమెరికా ట్రెజరీ ఈల్డ్స్ వంటి అంశాలు బంగారం ధరలపై ప్రభావం చూపుతున్నాయి. హైదరాబాద్‌లో వెండి ధర కూడా తగ్గింది. కిలో వెండి రూ.2,21,711.54గా నమోదై, గతరోజుతో పోలిస్తే రూ.2,562.11 తగ్గింది. అంతర్జాతీయ మార్కెట్‌లోనూ వెండి ధరలు ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. మొత్తంగా చూస్తే పసిడి ధరలు ప్రస్తుతం అంతర్జాతీయ పరిణామాలకు అనుగుణంగా ఒడిదుడుకులకు లోనవుతున్నాయి. అమెరికా వడ్డీరేట్లపై వచ్చే సంకేతాలు, డాలర్ కదలికలు, భౌగోళిక ఉద్రిక్తతలు రానున్న రోజుల్లో బంగారం ధరల దిశను నిర్ణయించే అవకాశముంది.

## పంజాబ్ కింగ్స్‌కు బిగ్ షాక్.. ఇద్దరు ఆస్ట్రేలియా దిగ్గజాలు అవుట్!

-బౌలింగ్, ఫీల్డింగ్ కోచ్‌లుగా ఉన్న హోప్స్, హాడిన్ రాజీనామా
-బిగ్ బాష్ లీగ్‌లో కొత్త బాధ్యతలు చేపట్టనున్న ఆస్ట్రేలియా మాజీలు
-ఇప్పటికే జట్టును వీడిన స్పిన్ బౌలింగ్ కోచ్ సాయిరాజ్ బహుతులే
-వరుసగా ముగ్గురు కీలక కోచ్‌లు దూరం కావడంతో పీబీకేఎస్‌కు ఎదురుదెబ్బ
-కొత్త కోచింగ్ స్టాఫ్ ఎంపిక బాధ్యత రికీ పాంటింగ్‌కే
-ఐపీఎల్ 2027 మినీ వేలానికి ముందే కొత్త బృందం సిద్ధం



స్పోర్ట్స్ డెస్క్:
ఐపీఎల్ 2027 సీజన్‌కు సన్నాహాలు చేస్తున్న పంజాబ్ కింగ్స్ మేనేజ్‌మెంట్‌కు ఊహించని పరిణామం ఎదురైంది. జట్టు హెడ్ కోచ్ రికీ పాంటింగ్‌తో కలిసి పనిచేస్తున్న ఆస్ట్రేలియా మాజీ ఆటగాళ్లు జేమ్స్ హోప్స్, బ్రాడ్ హాడిన్ తమ కోచింగ్ పదవులకు రాజీనామా చేశారు. పంజాబ్ కింగ్స్ ఫాస్ట్ బౌలింగ్ కోచ్‌గా జేమ్స్ హోప్స్, ఫీల్డింగ్ కోచ్‌గా బ్రాడ్ హాడిన్ సేవలు అందించారు. ఆస్ట్రేలియాలో జరిగే బిగ్ బాష్ లీగ్‌లో కొత్త బాధ్యతలు చేపట్టనున్న నేపథ్యంలోనే వీరిద్దరూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఢిల్లీ క్యాపిటల్స్‌లో రికీ పాంటింగ్‌తో కలిసి పనిచేసిన జేమ్స్ హోప్స్.. ఆ తర్వాత పాంటింగ్‌తో పాటే పంజాబ్ కింగ్స్‌లోకి వచ్చాడు. వీరిద్దరి మధ్య మంచి అనుబంధం ఉంది. బ్రాడ్ హాడిన్ విషయానికొస్తే.. ట్రెవర్ బేలిస్ హెడ్ కోచ్‌గా ఉన్న సమయంలోనే పంజాబ్ సపోర్ట్ స్టాఫ్‌లో చేరాడు. అప్పటి నుంచి జట్టుతో కొనసాగుతున్నాడు. తాజాగా వీరిద్దరూ ఒకేసారి వైదొలగడంతో పంజాబ్ కోచింగ్ బృందంలో కీలక స్థానాలు ఖాళీ అయ్యాయి. ఇప్పటికే పంజాబ్ కింగ్స్ స్పిన్ బౌలింగ్ కోచ్ సాయిరాజ్ బహుతులే కూడా జట్టును వీడిన విషయం తెలిసిందే. గౌతమ్ గంభీర్ నేతృత్వంలోని టీమిండియా కోచింగ్ బృందంలో చేరేందుకు ఆయన పంజాబ్‌కు గుడ్‌బై చెప్పాడు. దీంతో కొద్ది వ్యవధిలోనే ముగ్గురు కీలక కోచ్‌లు పంజాబ్ కింగ్స్‌కు దూరమయ్యారు. ఈ పరిణామంతో కొత్త కోచింగ్ సిబ్బందిని నియమించాల్సిన పరిస్థితి ఫ్రాంచైజీకి ఏర్పడింది. కొత్త కోచ్‌ల ఎంపిక ప్రక్రియను పంజాబ్ కింగ్స్ యాజమాన్యం ప్రారంభించినట్లు సమాచారం. ఫాస్ట్ బౌలింగ్, స్పిన్ బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాలకు కొత్త కోచ్‌లను నియమించాల్సి ఉంది. ఈ నియామకాల్లో హెడ్ కోచ్ రికీ పాంటింగ్‌దే కీలక పాత్రగా మారనుంది. ఫ్రాంచైజీ యాజమాన్యం కొన్ని పేర్లను సూచించినప్పటికీ.. తుది నిర్ణయాన్ని పాంటింగ్ అభిప్రాయానికి అనుగుణంగా తీసుకోవాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. అభ్యర్థులతో సంప్రదింపులు, ఇంటర్వ్యూల ప్రక్రియను త్వరలో ప్రారంభించనున్నట్లు సమాచారం. ఐపీఎల్ 2027 మినీ వేలం డిసెంబర్ మధ్యలో జరగనున్న నేపథ్యంలో.. అంతకంటే ముందే కొత్త కోచింగ్ సిబ్బంది ఎంపికను పూర్తి చేయాలని పంజాబ్ కింగ్స్ భావిస్తోంది. వేలంలో ఆటగాళ్ల ఎంపికతో పాటు జట్టు వ్యూహాల రూపకల్పనలో కోచింగ్ బృందం కీలకంగా వ్యవహరించనుంది. దీంతో సమయం తక్కువగా ఉండటంతో ఫ్రాంచైజీ వేగంగా కొత్త కోచ్‌ల కోసం అన్వేషణ కొనసాగిస్తోంది. త్వరలోనే కొత్త ఫాస్ట్ బౌలింగ్, స్పిన్ బౌలింగ్, ఫీల్డింగ్ కోచ్‌ల పేర్లను అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

## 16 ఏళ్ల కల నెరవేరింది..సూపర్ కింగ్స్ ఫ్యామిలీలోకి పొలార్డ్!

-జోహెన్నెస్‌బర్గ్ సూపర్ కింగ్స్‌కు కీరన్ పొలార్డ్
-ఎస్ఏ20 వేలంలో రూ.87.38 లక్షల బేస్ ప్రైస్‌కు కొనుగోలు
--2010 నుంచి పొలార్డ్ కోసం సూపర్ కింగ్స్ ప్రయత్నాలు
-ఎంఐ కేప్‌టౌన్ నుంచి రిలీజ్ కావడంతో వేలంలోకి వచ్చిన విండీస్ స్టార్
--గతంలో సీఎస్‌కేపై పొలార్డ్ అద్భుత ఇన్నింగ్స్‌లు
-ఇప్పుడు ప్రత్యర్థి నుంచి సూపర్ కింగ్స్ కుటుంబంలోకి మార్పు

స్పోర్ట్స్ డెస్క్:
ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్‌కు ఎన్నోసార్లు గట్టి సవాల్ విసిరిన ముంబై ఇండియన్స్ లెజెండ్, వెస్టిండీస్ మాజీ ఆల్‌రౌండర్ కీరన్ పొలార్డ్ ఎట్టకేలకు సూపర్ కింగ్స్ ఫ్యామిలీలోకి అడుగుపెట్టాడు. ఎస్ఏ20 2027 వేలంలో జోహెన్నెస్‌బర్గ్ సూపర్ కింగ్స్ అతడిని సుమారు రూ.87.38 లక్షల బేస్ ప్రైస్‌కు సొంతం చేసుకుంది. దీంతో 16 ఏళ్లుగా పొలార్డ్‌ను తమ ఫ్రాంచైజీతో కలుపుకోవాలన్న సూపర్ కింగ్స్ ప్రయత్నాలకు ఎట్టకేలకు ఫలితం దక్కింది. 2010 ఐపీఎల్ వేలం నుంచే పొలార్డ్‌ను జట్టులోకి



తీసుకోవాలని సూపర్ కింగ్స్ ఫ్రాంచైజీ ప్రయత్నించింది. ఆ వేలంలో సీఎస్‌కే, ముంబై ఇండియన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, కోల్‌కతా నైట్ రైడర్స్ పొలార్డ్ కోసం పోటీ పడ్డాయి. చివరకు సైలెంట్ టైబ్రేకర్ ద్వారా ముంబై ఇండియన్స్ అతడిని దక్కించుకుంది. ఆ తర్వాత 2022 వరకు ముంబై తరఫున ఆడిన పొలార్డ్.. ప్రస్తుతం ఆ జట్టుకు బ్యాటింగ్ కోచ్‌గా సేవలు అందిస్తున్నాడు. 2026 సీజన్ ముగిసిన తర్వాత ముంబై ఇండియన్స్‌కు చెందిన ఎంఐ కేప్‌టౌన్ పొలార్డ్‌ను రిలీజ్ చేయడంతో అతడు ఎస్ఏ20 వేలంలోకి వచ్చాడు. ఈ అవకాశాన్ని జోహెన్నెస్‌బర్గ్ సూపర్ కింగ్స్ సద్వినియోగం చేసుకుంది. వేలంలో బేస్ ప్రైస్‌కే అతడిని దక్కించుకుని తమ జట్టులో చేర్చుకుంది. చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్ మధ్య జరిగిన అనేక కీలక మ్యాచ్‌ల్లో పొలార్డ్ తన ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ప్రత్యేక ముద్ర వేశాడు. 2013, 2015, 2019 ఐపీఎల్ ఫైనల్స్‌లో సీఎస్‌కేపై ముంబై ఇండియన్స్ విజయాల్లో అతడి ప్రదర్శన కీలకంగా నిలిచింది. ముఖ్యంగా 219 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో సీఎస్‌కేపై 34 బంతుల్లో 87 పరుగులు చేసిన పొలార్డ్ ఇన్నింగ్స్ అభిమానులకు ఇప్పటికీ గుర్తుండిపోయింది.

# స్పోర్ట్స్

## కేవలం వినోదం కోసం ఆడతా: ట్రావిస్ హెడ్



ఆస్ట్రేలియా ఓపెనర్ ట్రావిస్ హెడ్ క్రీజులోకి వచ్చాడంటే చాలు బౌలర్లకు నరకమే. ప్రతి బంతిని బౌండరీ దాటించడమే ధ్యేయంగా ఆడే ఈ ఎడమచేతి వాటం బ్యాటర్ గురించి ప్రపంచ క్రికెట్‌లో ఒక అపోహ ఉంది. హెడ్ కేవలం రిస్క్ తీసుకుంటూ, ఎంజాయ్ చేయడానికి మాత్రమే బ్యాటింగ్ చేస్తాడని అందరూ అనుకుంటారు. అయితే ఈ ప్రచారంపై హెడ్ స్పందిస్తూ.. “ప్రజలు నా గురించి అనుకునే దానికి, నేను నిజంగా చేసే దానికి చాలా తేడా ఉంటుంది. అది చూసి నాకు నవ్వొస్తుంది. నేను ఆడే ప్రతీ షాట్ వెనుక పక్కా లెక్కలు ఉంటాయి. నేను చాలా లో-రిస్క్ ఆప్షన్లనే ఎంచుకుంటాను” అని స్పష్టం చేశాడు. ఇటీవల బంగ్లాదేశ్‌తో జరిగిన టెస్ట్ మ్యాచ్‌కు ముందు రోజు రాత్రి ట్రావిస్ హెడ్‌కు అస్సలు నిద్రపట్టలేదట. కారణం.. బంగ్లాదేశ్ ఫాస్ట్ బౌలర్ల రిలీజ్ పాయింట్లు, లోడ్-అప్‌లపై అతనికి పూర్తి స్పష్టత లేకపోవడమే. మ్యాచ్ ప్రారంభానికి ముందు గ్రౌండ్ చుట్టూ వాకింగ్ చేస్తూ బంగ్లాదేశ్ పేసర్లు వార్మప్ అయ్యే సమయంలో వారి బౌలింగ్ యాక్షన్లను నిశితంగా పరిశీలించాడు. మైదానంలోకి దిగే ముందే ప్రత్యర్థుల ప్రతి మూవ్‌మెంట్‌ను పసిగట్టడం హెడ్ ప్రిపరేషన్‌లో ఒక భాగం. మిగతా బ్యాటర్లలా గంటల తరబడి నెట్స్‌లో గడపడం హెడ్‌కు పెద్దగా నచ్చదు. ప్రత్యర్థి బౌలర్ల వీడియోల కంటే, యూట్యూబ్‌లో తాను గతంలో ఆడిన అత్యుత్తమ ఇన్నింగ్స్‌లను చూడటానికే అతను ఎక్కువ ప్రాధాన్యత ఇస్తాడు. “నేను యూట్యూబ్‌లో నా పాత ఇన్నింగ్స్‌లు చూస్తాను. అది నాకు మంచి కాన్ఫిడెన్స్‌ను ఇస్తుంది. అంతేకాకుండా, నెట్స్‌లో ఆడేటప్పుడు ప్రశాంతతను కోరుకుంటా. ఎవరైనా నా ఏకాగ్రతను దెబ్బతీస్తే నాకు కోపం వస్తుంది” అని హెడ్ పేర్కొన్నాడు. సౌతాఫ్రికాలోని వికెట్లు నెమ్మదిగా ఉండే అవకాశం ఉండటంతో, పిచ్ పరిస్థితులకు తగ్గట్లుగా తన క్రీజ్ పొజిషన్‌ను మార్చుకున్నట్లు తెలిపాడు. గత 12 ఏళ్ల కెరీర్‌లో ఎప్పుడూ లేని విధంగా క్రీజ్ వెలుపలికి వచ్చి ఆడటం ప్రాక్టీస్ చేశాడు. బంతి స్టంప్స్‌ను తాకకుండా జాగ్రత్త పడటానికే ఈ మార్పు చేసుకున్నట్లు వెల్లడించాడు. రాబోయే సౌతాఫ్రికా టెస్టు సిరీస్ అత్యంత కఠినంగా ఉండబోతోందని, దానిని ఎదుర్కొనేందుకు తాను పూర్తిస్థాయిలో సిద్ధమయ్యానని ధీమా వ్యక్తం చేశాడు.

మార్నింగ్ కాఫీ విత్ హాట్ న్యూస్‌తో...! మీ
డ్రీమ్ టైమ్స్
తెలుగు దిన పత్రిక
DREAM TIMES DAILY NEWS PAPER

శుక్రవారం
9-10-2026





# డోసు పెంచేసిన అవికా గోర్...

# గ్లామర్‌కే పరిమితం కావాలనుకోవడం లేదు..

## ఇకపై అలాంటి పాత్రలే చేస్తా: దిశా పటాని



బాలీవుడ్‌లో తన గ్లామర్‌తో పాటు నటనతోనూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అందాల భామ దిశా పటాని ఇప్పుడు తన కెరీర్ విషయంలో కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు ఎక్కువగా గ్లామర్‌కు ప్రాధాన్యం ఉన్న పాత్రల్లో కనిపించిన ఈ ముద్దుగుమ్మ.. ఇకపై వైవిధ్యమైన, బలమైన పాత్రలతో ప్రేక్షకులను అలరించాలని కోరుకుంటోంది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన సినీ ప్రయాణం, ఇప్పటివరకు నేర్చుకున్న విషయాలు, భవిష్యత్తులో ఎలాంటి పాత్రలు చేయాలనుకుంటోందనే అంశాలపై దిశా ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది.దిశా పటాని తొలిసారిగా 'ఎంఎస్ ధోనీ: ది అన్‌టోల్డ్ స్టోరీ' సినిమాతో ప్రేక్షకులకు పరిచయమైంది. భారత క్రికెట్ దిగ్గజం మహేంద్ర సింగ్ ధోనీ జీవిత కథ ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రంలో ఆమె నటనకు మంచి గుర్తింపు లభించింది. ఆ సినిమా విడుదలై పదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా తన ప్రయాణాన్ని గుర్తు చేసుకుంది. ఈ పదేళ్లలో నటిగా ఎన్నో విషయాలు నేర్చుకున్నానని దిశా తెలిపింది. విభిన్నమైన అనుభవాలు తనను మరింత పరిణతి చెందిన నటిగా తీర్చిదిద్దాయని చెప్పింది. ఇప్పటివరకు తాను ఎక్కువగా గ్లామర్‌కు ప్రాధాన్యమున్న సినిమాల్లో నటించినప్పటికీ, ఇకపై తన కెరీర్‌లో కొత్త ప్రయోగాలు చేయాలనుకుంటున్నట్లు వెల్లడించింది. సినిమా పరిశ్రమలో గ్లామర్‌తో గుర్తింపు తెచ్చుకోవడం ఒక ఎత్తయితే, నటిగా విభిన్నమైన పాత్రలతో ప్రేక్షకుల మనసుల్లో స్థానం సంపాదించడం మరో ఎత్తు. ఈ విషయాన్ని దిశా పటాని కూడా గుర్తించినట్లు ఆమె వ్యాఖ్యలను బట్టి అర్థమవుతోంది. ఇకపై ఒకే తరహా పాత్రలకు పరిమితం కాకుండా, తనలోని నటనా ప్రతిభను బయటపెట్టే అవకాశాల కోసం ఎదురుచూస్తున్నట్లు చెప్పింది. కేవలం తెరపై అందంగా కనిపించడమే కాకుండా, కథలో కీలక పాత్ర పోషించే క్యారెక్టర్లు చేయాలని ఉందని దిశా తెలిపింది. ప్రేక్షకులు తన పాత్రతో భావోద్వేగపరంగా అనుసంధానమయ్యేలా ఉండాలని, కథను ముందుకు తీసుకెళ్లడంలో ఆ పాత్రకు ప్రాధాన్యం ఉండాలని కోరుకుంటున్నట్లు వెల్లడించింది. ప్రస్తుతం దిశా పటాని 'హోలీగార్డ్స్ సాగా: ది పోర్టల్ ఆఫ్ ఫోర్స్' అనే హాలీవుడ్ చిత్రంలో నటిస్తున్నట్లు సమాచారం. భారతీయ సినిమాలతో పాటు అంతర్జాతీయ ప్రాజెక్టుల్లోనూ అవకాశాలను అందిపుచ్చుకుంటున్న ఆమెకు ఈ చిత్రం కెరీర్‌లో మరో కీలక అడుగు కానుంది.

# భారతీయుడు 3పై బిగ్ అప్డేట్..

## కమల్ హాసన్, శంకర్ కాంబో మళ్లీ రాబోతోందా?




ఒకప్పుడు తన సినిమాలతో భారతీయ సినిమా స్థాయిని మరో మెట్టు పైకి తీసుకెళ్లిన దర్శకుడు శంకర్. భారీ సెట్లు, అద్భుతమైన విజువల్స్, సామాజిక సందేశంతో కూడిన కథాంశాలతో ఆయన తెరకెక్కించిన చిత్రాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా యూనివర్సల్ హీరో కమల్ హాసన్‌తో ఆయన రూపొందించిన 'భారతీయుడు' సినిమా సంచలన విజయాన్ని అందుకుంది. అయితే ఈ చిత్రానికి సీక్వెల్‌గా వచ్చిన 'భారతీయుడు 2' మాత్రం బాక్సాఫీస్ వద్ద తీవ్ర నిరాశను మిగిల్చింది. దీంతో ఇప్పుడు అందరి దృష్టి మూడో భాగం 'భారతీయుడు 3'పై పడింది.కమల్ హాసన్, శంకర్ కాంబినేషన్‌లో 'భారతీయుడు 2' ప్రకటించినప్పటి నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. చాలా సంవత్సరాల తర్వాత సేనాపతి పాత్రలో కమల్ హాసన్ మరోసారి కనిపించనుండటంతో అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూశారు. అయితే సినిమా విడుదలైన తర్వాత ప్రేక్షకుల నుంచి మిశ్రమ స్పందన వచ్చింది. బాక్సాఫీస్ వద్ద కూడా ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోలేకపోయింది. దీంతో 'భారతీయుడు 3' విడుదలపై సందేహాలు మొదలయ్యాయి. రెండో భాగంలో కథను పూర్తిస్థాయిలో చూపించకుండా మూడో భాగం కోసం కీలక అంశాలను దాచిపెట్టారంటూ కొందరు ప్రేక్షకులు విమర్శించారు. మరోవైపు మూడో భాగాన్ని నేరుగా ఓటీటీలో విడుదల చేస్తారని, అసలు థియేటర్లలోకి రాకపోవచ్చని కూడా సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో 'భారతీయుడు 3'కి సంబంధించి తాజాగా వచ్చిన సమాచారం అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. కమల్ హాసన్, శంకర్ కలయికలో మూడో భాగం కూడా ఉందనే విషయంపై మరోసారి చర్చ మొదలైంది. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించిన షూటింగ్‌లో ఎక్కువ భాగం పూర్తయినట్లు సమాచారం. మిగిలిన చిత్రీకరణతో పాటు విజువల్ ఎఫెక్ట్స్ పనులను పూర్తి చేయాల్సి ఉందని తెలుస్తోంది. అయితే సినిమా విడుదల తేదీపై మాత్రం ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. నిర్మాణానంతర పనులు ఎప్పుడు పూర్తవుతాయి? చిత్రాన్ని ఎప్పుడు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తారు? థియేటర్లలోనే విడుదల చేస్తారా? అనే ప్రశ్నలకు చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ప్రస్తుతం దర్శకుడు శంకర్‌కు కూడా 'భారతీయుడు 3' విజయం కీలకంగా మారింది. ఒకప్పుడు తనదైన శైలితో భారతీయ సినిమా ప్రేక్షకులను ఆశ్చర్యపరిచిన ఆయన.. మళ్లీ బలమైన కథతో విజయాన్ని అందుకోవాలని అభిమానులు కోరుకుంటున్నారు.



# అందరూ తీర్పులిచ్చేవారే!

రక్షాబంధన్ వాణిజ్య ప్రకటనలో కథానాయిక కృతిసనన్ ధరించిన దుస్తులపై సోషల్‌మీడియాలో తీవ్ర విమర్శలు వచ్చిన విషయం తెలిసిందే. సంప్రదాయ వేడుకలో అలాంటి దుస్తులు ధరించడమేంటని కొందరు అభ్యంతరం వ్యక్తం చేశారు. తాజాగా ఈ వివాదంపై కృతిసనన్ మరోమారు స్పందించింది. కరీనా కపూర్ నిర్వహిస్తున్న 'వాట్ విమెన్ వాంట్' సీజన్ 6లో పాల్గొన్న ఆమె ఈ వివాదంపై మాట్లాడింది. 'నేను ధరించిన డ్రెస్ ఇంత వివాదం సృష్టిస్తుందని అనుకోలేదు. ఏకంగా ఆరుగురు కూర్చుని చేసే ప్రైమ్‌టైమ్ న్యూస్ ప్యానెల్ డిబేట్‌గా మారింది.ఇతరుల్ని జడ్జ్ చేస్తూ తీర్పులు ఇవ్వడం చాలా సులభం. ఇక్కడ అందరూ తీర్పులిచ్చేవారే. ఎవరి పని వారు చేసుకుంటే ఎలాంటి ఇబ్బంది ఉండదు' అంటూ కృతిసనన్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం ఆసక్తికరంగా మారాయి. రక్షాబంధన్ ప్రకటనలో కృతిసనన్ ఇండో-వెస్ట్రన్ దుస్తుల్లో కనిపించింది. తన సోదరుడితో పాటు శునకానికి రాఖీ కట్టినట్లుగా ఆ ప్రకటనలో చూపించారు. ఈ వివాదం నేపథ్యంలో చివరకు మేకర్స్ ఆ యాడ్‌ను తొలగించారు.

# రణబాలి ట్రైలర్‌కు రంగం సిద్ధం.

## విజయ్ దేవరకొండ, రష్మిక సినిమాపై భారీ అంచనాలు




రౌడీ హీరో విజయ్ దేవరకొండ, నేషనల్ క్రష్ రష్మిక మందన్న జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'రణబాలి'. పీరియడ్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాపై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. 'శ్యామ్ సింగ రాయ్' ఫేమ్ రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా అక్టోబర్ 16, 2026న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది. విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న మరోసారి కలిసి నటిస్తుండటంతో ఈ సినిమాపై మొదటి నుంచే ఆసక్తి ఏర్పడింది. వీరిద్దరి కాంబినేషన్‌కు ఉన్న క్రేజ్‌కు తోడు.. పీరియడ్ నేపథ్యం, భారీ యాక్షన్ సన్నివేశాలు, దర్శకుడు రాహుల్ సంకృత్యాన్ తెరకెక్కిస్తున్న విధానం సినిమాపై అంచనాలను మరింత పెంచుతున్నాయి. పాన్ ఇండియా స్థాయిలో పలు భాషల్లో ఈ సినిమాను విడుదల చేసేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది.సినిమా విడుదలకు సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో చిత్రబృందం ప్రమోషన్స్‌ను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా 'రణబాలి' ట్రైలర్‌ను ఈరోజు ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. దాదాపు 3 నిమిషాల 47 సెకన్ల నిడివితో ఉండనున్న ఈ ట్రైలర్ సాయంత్రం 6:03 గంటలకు డిజిటల్‌గా విడుదల కానుంది. అయితే ట్రైలర్‌ను కేవలం ఆన్‌లైన్‌లో విడుదల చేయకుండా.. మీడియా సమక్షంలో ప్రత్యేక కార్యక్రమాన్ని కూడా నిర్వహించనున్నారు. హైదరాబాద్‌లోని దసపల్లా హోటల్‌లో మధ్యాహ్నం 2 గంటల తర్వాత చిత్రబృందం విలేకరుల సమావేశంలో పాల్గొననుంది. ఈ కార్యక్రమంలో సినిమా ప్రధాన తారాగణం, సాంకేతిక బృందం పాల్గొని 'రణబాలి' విశేషాలను మీడియాతో పంచుకోనున్నారు. 'రణనబాలి'ని ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ భారీ స్థాయిలో నిర్మిస్తోంది. పీరియడ్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రానికి నిర్మాణ విలువలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయని చిత్రబృందం చెబుతోంది. పలు భాషల్లో విడుదల చేయడం ద్వారా దేశవ్యాప్తంగా ప్రేక్షకులకు సినిమాను చేరువ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. మరోవైపు ఈ సినిమాకు సంగీతం కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ప్రముఖ సంగీత ద్వయం అజయ్-అతుల్ ఈ చిత్రానికి స్వరాలు సమకూరుస్తున్నారు. పీరియడ్ నేపథ్యానికి తగ్గట్టుగా సంగీతాన్ని ప్రత్యేకంగా రూపొందించినట్లు తెలుస్తోంది.

# పవన్ కల్యాణ్ నా చిన్ననాటి క్రష్: ఆనంది



తెలుగు, తమిళ చిత్రాలతో నటిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న ఆనంది.. ఏపీ డిప్యూటీ సీఎం, పవర్ స్టార్ పవన్ కల్యాణ్‌పై చేసిన ఆసక్తికర వ్యాఖ్యలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. చిన్నప్పటి నుంచి తాను పవన్ కల్యాణ్‌కు పెద్ద అభిమానినని, ఆయనే తన క్రష్ అని ఆమె తన మనసులోని మాటను వెల్లడించారు. తన తాజా చిత్ర ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఆనంది మీడియాతో ముచ్చటించారు. ఈ సందర్భంగా, మీకు ఇష్టమైన హీరో ఎవరు? అని విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆమె ఏమాత్రం తడుముకోకుండా సమాధానమిచ్చారు. "చిన్నప్పటి నుంచి నాకు పవన్ కల్యాణ్ గారంటే ఎంతో ఇష్టం. నిజం చెప్పాలంటే చిన్నతనం నుంచే ఆయనే నా క్రష్" అంటూ తన అభిమానాన్ని చాటుకున్నారు. పవన్ కల్యాణ్ సినిమా విడుదలవుతోందంటే చాలు, తమ ఇంట్లో పండగ వాతావరణం నెలకొంటుందని ఆమె వ్యాఖ్యానించారు. వెండితెరపై ఆయన ప్రదర్శించే విలక్షణమైన మ్యానరిజమ్స్, స్టైల్‌ను తాను ఎంతగానో ఇష్టపడతానని తెలిపారు. నటిగా చిత్ర పరిశ్రమలో అడుగుపెట్టి, తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న తర్వాత కూడా పవన్‌పై ఉన్న అభిమానం ఏమాత్రం తగ్గలేదని ఆమె స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆనంది చేసిన ఈ వ్యాఖ్యలు నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి.

Printer. Publisher and owned by Dr k Soumya, and printed it kalanjali offset printers, shop no.23, sowjanya complex, N.K road , Srinivas Nagar, nandyal-518501 shop no 7, Sai revenue complex, mro office complex, nandyal town -518501 nandyal district (AP) editor: Dr k Sowmya. Email: editor@dream Times.in, editor@dream Times.co.in, cell:8500066609,RNI NO:APTEL 2021/81831